15CTR1:15CTR1.qxd 10/14/2026 11:42 PM Page 1



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

## ముత్యపుపందిరిపై లక్ష్మీవల్లభుడు



తిరుమల, అక్టోబర్ 14 ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీకృష్ణుని అవతారమే కలియుగంలో వేంకటేశ్వరుడుగా ఏడుకొండల్లో కొలువైన స్వామిచల్లని దేవుడు. భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. స్వామివారికి జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి మలయప్పస్వామి ముత్యపుపందిరిపై ఊరేగి భక్తులను కటాక్షించారు. రాత్రి వాహనమండపం నుండి స్వామివారి వాహనం బయలుదేరి ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ముత్యాలు విలువైనవి. చల్లదనాన్ని ప్రసాదిస్తాయి. తెల్లనికాంతులీనుతుంటాయి. అంతటి చల్లనిదేవుడు శ్రీనివాసుడు దర్శనంతో భక్తులు తన్మయంతో భక్తికి లోనయ్యారు. ఈ వాహనసేవలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, జానకిదేవి, రంగశ్రీ, శాంతారామ్, సివిఎస్ఓ కెవిమురళీకృష్ణ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి,ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ,అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## "యోగనరసింహుడిగా" ఏడుకొండలవాడు



తిరుమల, అక్టోబర్ 14 ప్రభాతవార్త :

"యోగనరసింహస్వామి" రూపంలో అనంతతేజోమూర్తి మలయప్పసా ్వమి బుధవారం ఉదయం వేళ సింహవాహనాన్ని అధిరోహించి భక్తులకు అభయమిచ్చాడు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు ఉదయ ం మలయప్పస్వామి యోగనరసింహుడు అలంకారంలో భక్తులను బ్రోవడానికి ఆలయ మాఢవీధుల్లో విహరించారు. భక్తులకు దర్శనభాగ్యమిచ్చారు. ఈ వాహనసేవలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, జానకిదేవి, రంగశ్రీ, శాంతారామ్, సివిఎస్ఓ కెవిమురళీకృష్ణ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఆలయ పేష్కార్ రామకృష్ణ,అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చెంగాళమ్మకు శ్రీ అష్టకాళి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి ఉత్సవాల భాగంగా అమ్మవారికి బుధవారం శ్రీఅష్టకాళి అలంకారంచేసి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రత్యేక అలంకారానికి హైదరాబాద్ చెందిన మద్దాలి శరణ్ కుమార్‌రెడ్డి, లక్ష్మీ ప్రియారెడ్డి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. దేవస్థానం ప్రాంగణంలోని యాగ మండపంలో నిర్వహించిన చండీయాగానికి సూళ్లూరుపేటకు చెందిన మాదరపాక జగన్మోహన్, గౌరీ దంపతులుగా ఉన్నారు. శ్రీకృష్ణ రాయబార ఘట్టం భక్తులను అలరించాయి. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

- మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపిటీసీ, సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్, ఎస్పీ
- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్ - 1 జనవరి 2026 నాటి ఓటర్ల జాబితా ప్రాతిపదికన ఎన్నికలు
- 28న మున్సిపల్ ఎన్నికల పోలింగ్, 30న ఫలితాలు
- నవంబర్ 3న జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికల పోలింగ్, నవంబర్ 5న ఫలితాలు
- నవంబర్ 26న తొలి దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్, 29న రెండవ దశ పంచాయతీ పోలింగ్,
- డిసెంబర్ 2న 3వ దశ పంచాయతీ పోలింగ్




మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు.

చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపిటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు బుధవారం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్,ఎస్పీ తుషార్ డూడిలు మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 1 జనవరి 2026 నాటి ఓటర్ల జాబితా ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 28వ తేదీన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుగనుందని, 30వ తేదీ ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామన్నారు. అలాగే నవంబర్ 3వ తేదీ జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికలు జరుగుతాయని, ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 5వ తేదీ వెల్లడిస్తామన్నారు. అలాగే జిల్లాలో 3 దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టామని మొదటి దశలో నవంబర్ 26న పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, నవంబర్ 29వ తేదీ రెండవ దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్, 3వ దశ డిసెంబర్ 2న పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, ఎన్నికల పోలింగ్ జరిగిన సాయంత్రమే ఈ ఎన్నికల ఫలితాలు వెల్లడి అవుతాయన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేశామన్నారు. జిల్లాలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, నగరి, పలమనేరు, కుప్పం మున్సిపాల్టీల పరిధిలో సుమారు 168 వార్డులు, 2.79 లక్షల మంది ఓటర్లు వున్నారన్నారు. అలాగే జిల్లాలోని 27 మండలాల పరిధిలో 622 గ్రామ పంచాయతీలు వుండగా విలీనానికి సంబంధించి కోర్టుల్లో వివాదాల కారణంగా 3 గ్రామ పంచాయతీలు మినహా మిగిలిన 619 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 10.26 లక్షల ఓటర్లు వున్నారని, జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో 24.4 శాతం ఓటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 78 శాతం ఓటర్లు వున్నారని, మొత్తం 13,06,725 మంది ఓటర్లు వున్నారన్నారు. మున్సిపాల్టీలకు సంబంధించి వార్డుల వారీగా ఇప్పటికే రిజర్వేషన్లు ప్రకటించామని, ఎంపిపి, జడ్పీటీసీ, ఎంపిటీసీ స్థానాల రిజర్వేషన్లను నిబంధనల మేరకు ప్రకటించడం జరిగిందని, సర్పంచ్ స్థానాల రిజర్వేషన్ల గెజిట్ ప్రచురణకు చర్యలు తీసుకున్నామన్నారు. 1 జనవరి 2026 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకున్నామని, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి, సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై అవసరమైన ఏర్పాట్లు చేపట్టామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో నిబంధనలకు ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైందని, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ మున్సిపాల్టీ, స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సుమారు 1,500 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ప్రణాళిక సిద్ధం చేశామని, నామినేషన్ల దశ నుండి ప్రచారం, పోలింగ్‌కు ముందు ఎన్నికల సామాగ్రి తరలింపు, పోలింగ్ రోజు, పోలింగ్ అనంతరం కౌంటింగ్ వరకు అన్ని దశలను పరిగణనలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించే అవకాశం వున్న 779 మందిని గుర్తించడం జరిగిందని, వారిలో సుమారు 50 శాతం మందిపై ఇప్పటికే బైండోవర్ చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో వున్న నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేయడానికి చర్యలు చేపట్టామని, జిల్లాలో వున్న 556 లైసెన్స్‌డ్ ఆయుధాల్లో 421 ఇప్పటికే డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, నగదు పంపిణీ, ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలు, అనధికారిక ఆయుధాల వినియోగం వంటి వాటిని అరికట్టడానికి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, తనిఖీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో పట్టణ, స్థానిక సంస్థల పరిధిలో గత ఎన్నికల సమయంలో జరిగిన సంఘటనలు, నమోదైన కేసులు, స్థానిక పరిస్థితులు, ఓటర్ల భద్రత తదితర అంశాల ఆధారంగా సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 175 ప్రాంతాల్లో 88, కుప్పంలో 24 ప్రాంతాల్లో 11, నగరిలో 33 ప్రాంతాల్లో 18, పలమనేరులో 29 ప్రాంతాల్లో 12 ప్రాంతాలు సున్నిత లేదా అత్యంత సున్నిత ప్రాంతాలుగా గుర్తించడం జరిగిందన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక పోలీసు అధికారులను సమన్వయం చేసుకుని సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తామని, ఎన్నికల పోలింగ్ ముందు చివరి 48 గంటల్లో నగదు, మద్యం అక్రమ రవాణా, ఇతర ప్రాంతాల నుండి అనధికారిక వ్యక్తుల రాకపోకలను నియంత్రించడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

## మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల ఎఫెక్ట్

### - పలువురు ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐల బదిలీలు

చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆ ఎఫెక్ట్ పోలీసు శాఖపై పడింది. జిల్లాలో పలువురు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేస్తూ ఎస్పీ తుషార్ డూడి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్లూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జయరామయ్య ఎస్టీ సెల్ ఇన్స్‌పెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే జిల్లాకు బదిలీపై వచ్చిన ఇన్స్‌పెక్టర్ శ్రీప్రసాద్‌ను కల్లూరు ఇన్స్‌పెక్టర్‌గా నియమించారు. అలాగే కల్లూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు కార్వేటినగరం ఎస్ఐగా బదిలీ అయ్యారు. కార్వేటినగరం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తేజస్వీని విఆర్‌కు బదిలీ చేశారు. చిత్తూరు టుటౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటసుబ్బయ్య కల్లూరు ఎస్ఐగా బదిలీ అయ్యారు.

## తిరుపతి విస్తరణలో మరో మైలురాయి

### దామినేడు వద్ద రేణిగుంట - నాయుడుపేట హైవే కనెక్టివిటీ రోడ్డు పనులకు భూమిపూజ..



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

తిరుపతి నగరం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల కల్పనకు సరికొత్త రూపురేఖలు మారుతున్నాయి. ఇందులో భాగంగా రేణిగుంట ప్రధాన రహదారి నుంచి దామినేడు మీదుగా నాయుడుపేట జాతీయ రహదారిని అనుసంధానించే నూతన మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులకు దామినేడు వద్ద శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు గారు,తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి గారు, చంద్రగిరి శాసనసభ్యులు శ్రీ పులివర్తి నాని గారు, తుడా వైస్ ఛైర్మన్ శ్రీ ఆర్. గోవింద రావు గారు, తితిదే జేఈఓ శరత్ గారు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి గారు, భానుప్రకాశ్ రెడ్డి గారు, వన్నెకుల క్షత్రియ ఛైర్మన్ సి ఆర్ రాజన్ గారు, యాదవ కార్పొరేషన్ అధ్యక్షుడు నరసింహా యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. .. ప్రస్తుతం రేణిగుంట, తిరుపతి మార్గంలో నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అధిగమించేందుకు ఈ నూతన రహదారి అత్యంత కీలకం కానుంది. .. చెన్నై, నాయుడుపేట, శ్రీకాళహస్తి వైపు వెళ్లే భారీ వాహనాలు, సుదూర ప్రాంత ప్రయాణికులు నగర అంతర్గత రహదారుల్లోకి రాకుండా ఈ లింక్ రోడ్డు ద్వారా నేరుగా హైవేను చేరుకోవచ్చని నేతలు తెలిపారు. .. దామినేడు మరియు పరిసర ప్రాంతాలు ఈ రోడ్డు నిర్మాణంతో వేగంగా అభివృద్ధి చెందనున్నాయి. నివాస, వాణిజ్య సముదాయాల విస్తరణకు అనువైన వాతావరణం ఏర్పడటంతో పాటు స్థానికులకు మెరుగైన రవాణా సదుపాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తుడా అధికారులు, ఇంజనీరింగ్ విభాగం ప్రతినిధులు, కూటమి ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ దేవి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ

చంద్రగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



అన్నపూర్ణ దేవి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ నంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరిలో అమ్మవారి దేవీ నవరాత్రి మహోత్సవాలను దేవాదాయ ధర్మాధాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాలక మండలి, ఈఓ మమత పర్యవేక్షణలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయ అర్చకులు సూరిస్వామి అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారి ఉత్సవ మూర్తిని వేంచేపుగా ఆలయ పడికావలికి తీసుకువచ్చారు. అమ్మవారిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి నంది వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ ఓంశక్తి భక్తుల భజనలతో అమ్మవారి నంది వాహనసేవ కన్నుల పండువగా సాగింది.

# తిరుపతి మేయర్ ఎన్నికపై కూటమిలో ఉత్కంఠ!

### -పార్టీ మారిన ప్రణీత్‌తో కొత్త సమీకరణాలు - టిడిపి,బిజెపిలో పలువురు ఆశావహులు

ప్రభాతవార్త-తిరుపతి:

ఎంతో ప్రాధాన్యత ఉన్న తిరుపతి మేయర్ ఎన్నిక కూటమి పార్టీల్లో ఉత్కంఠ రేపుతోంది. రోజుకో పేరు తెరపైకి వస్తుండటం, మారుతున్న రాజకీయ పరిణామాలతో మేయర్ అభ్యర్థి ఎవరనే అంశంపై గందరగోళం నెలకొంది. తొలుత ఈ స్థానం తెలుగుదేశం పార్టీకే కేటాయిస్తారని భావించినప్పటికీ తాజాగా బిజెపి కూడా మేయర్ పదవిని కోరడంతో సమీకరణాలు మారిపోయాయి. ఇదే సమయంలో టిడిపి టికెట్ ఆశించి నిరాశ చెందిన ప్రణీత్ పెనుమాదు బుధవారం జనసేనలో చేరడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. తిరుపతి ఎమ్మెల్యేగా జనసేనకు చెందిన శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో మేయర్ పదవిని టిడిపికి కేటాయించాలనే అభిప్రాయం కూటమిలోని కీలక నేతల మధ్య ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా బిజెపి ఈ స్థానాన్ని కోరడంతో ఆ పార్టీకి చెందిన పి. నవీన్ కుమార్ రెడ్డి, జి. భాను ప్రకాష్ రెడ్డి పేర్లు తెరపైకి వచ్చాయి.

**-జనసేనలోకి ప్రణీత్ :**

టిడిపి నుండి మేయర్ టికెట్ ఆశించి నిరాశ చెందిన విద్యావేత్త ప్రణీత్ పెనుమాదు బుధవారం పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. విజయవాడకు చెందిన వంగవీటి రాధాకృష్ణతో కలిసి ఆయన జనసేన తీర్థం పుచ్చుకున్నారు. దీంతో జనసేన తరఫున ప్రణీత్‌కు మేయర్ టికెట్ దక్కవచ్చనే ప్రచారం ఊపందుకుంది. అయితే ఆయన చేరికపై కూటమి వర్గాల్లో, జనసేన కార్యకర్తల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికల్లో సొంత ఖర్చులు భరించి జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేశానని చెప్పిన ప్రణీత్, ఇప్పుడు టికెట్ కోసం పార్టీ మారితే ఆయనకు ఎలా మద్దతు ఇవ్వాలంటూ కొందరు టిడిపి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అదేగాక గతంలో టిడిపి తరపున తిరుపతి ఇన్‌ఛార్జి పదవిని కూడా ఆశించారు. ఇటీవల బలిజ సామాజిక వర్గ



సమావేశంలో పాల్గొన్న ప్రణీత్, పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలనే తీర్మానానికి మద్దతు తెలిపిన అంశాన్ని కూడా కొందరు ప్రస్తావిస్తున్నారు. చివరి క్షణంలో పార్టీలో చేరిన వారికి టికెట్ ఇస్తే దీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు అన్యాయం చేసినట్లవుతుందని జనసేనలోని కొందరు బలంగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే డాక్టర్ వెంకటేశ్వర్లు, కిరణ్ రాయల్ తదితరులు జనసేన టికెట్ ఆశిస్తున్న నేపథ్యంలో ప్రణీత్ చేరికతో ఆ పార్టీలో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.- టిడిపిఅభ్యర్థిగా హర్షవర్ధన్ రెడ్డి పేరు!:మరోవైపు తాజా రాజకీయ ప్రచారం ప్రకారం తిరుపతి మేయర్ స్థానం టిడిపికే దక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యావంతుడు, యువనేత డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలనే నారా లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా ఆయనకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇదే సమయంలో సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో టిడిపిలో యువ నాయకత్వానికి ప్రాధాన్యతనిస్తారా? లేక సీనియర్ నేతకు అవకాశం కల్పిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

### జనరల్ కేటగిరీతో మారిన లెక్కలు

తిరుపతి మేయర్ స్థానం జనరల్ కేటగిరీకి కేటాయించడంతో అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలు మారిపోయాయి. అంతకుముందు యాదవ సామాజిక వర్గానికి చెందిన అన్నా అనితా యాదవ్, వి.పుష్పావతియాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్ పేర్లు బలంగా వినిపించాయి. ఇప్పుడు రిజర్వేషన్ మారడంతో ఇతర సామాజిక వర్గాలకు చెందిన ఆశావహులు కూడా పోటీలోకి వస్తున్నారు.

మొత్తంగా తిరుపతి మేయర్ పదవి కేటాయింపుపై కూటమి పార్టీల మధ్య చర్చలు, ఆశావహుల ప్రయత్నాలు ఉత్కంఠను పెంచుతున్నాయి. పార్టీ మార్పులు, అంతర్గత అసంతృప్తులు, యువ నాయకత్వం వర్సెస్ సీనియర్ నాయకత్వం వంటి అంశాల మధ్య చివరకు కూటమి ఎవరిని అభ్యర్థిగా ఎంపిక చేస్తుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే అభ్యర్థి ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ పేర్లన్నీ ప్రచారంలో ఉన్న అవకాశాలుగానే పరిగణించాల్సి ఉంటుంది.

# ఆశావహుల్లో టిక్కెట్లు గోల

### గ్రామాల్లో సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసిల ఎన్నికల సందడి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తిలో స్థానిక ఎన్నికల నగారా మోగింది.దాంతో ఆశావహుల్లో టిక్కెట్లు గోల మొదలైంది. ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకొని ఉన్న కూటమి మద్దతు దారులు బుధవారం ఉదయం నుంచి ఊరం దూరులోని శాసనసభ్యుని ఇంటి వద్దకు చేరారు. ఎవరి ప్రయత్నాలు వారి అన్నట్లు మారింది. కొందరు పైరవీలు సాగిస్తుండగా మరి కొందరు తాము పార్టీ కోసం పాటు పడ్డామని తమకు అవకాశం కల్పించమని కోరుతున్నారు.అయితే శ్రీకాళహస్తి మండల జడ్‌పిటిసి ఎస్‌సి మహిళకు రిజర్వ్ అయ్యింది. తిరుపతిజిల్లా పరిషత్ కూడా ఎస్‌సి మహిళలకు కేటాయించారు. దాంతో శ్రీకాళహస్తికి ఎందిన మహిళకే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

**మండల నాయకులతో కళ కళ . . .**

శ్రీకాళహస్తి శాసనసభ్యుని ఇంట మండల నాయకుల సందడితోకళ కళ లాడుతుంది. ఉదయం నుంచి ఓ వైపు ఎంపిటిసి అభ్యర్థులుగా పోటీ చేసేవారు. తమకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు,శ్రీకాళహస్తి,తొట్టంబేడు మండలాల్లో రిజర్వేషన్ల ఉత్కంఠతకు తెర పడింది. ఏర్పేడు మండలంలోని రిజర్వేషన్లను పరిశీలిస్తే పల్లం కోబాకలు ఎస్‌సి పురుషులకు కేటాయించారు. పంగూరు ఎస్‌సి మహిళ,చెల్లూరు ఎస్‌టి పురుషులు, కందాడు ఎస్‌టి మహిళ, పాతవీరాపురం బిసి పురుషులు అమందూరు, పాపానాయుడుపేటలను బిసి మహిళలకు, గుడిమల్లం, మడిబాక, ముసలిపేడు, బండారుపల్లిలు పురుషుల అన్‌రిజర్వ్‌డగా ఖరారు చేసారు. అన్‌రిజర్వ్‌డ్ మహిళలకు ఏర్పేడు,మర్రిమంద, వికృతమాల, అంజిమేడులను కేటాయించారు. మండలాధ్యక్ష కుర్చికి బిసిలకు కేటాయించారు. జడ్‌పిటిసి స్థానంను అన్‌రిజర్వ్‌డ్‌మ హిళకుకేటాయించారు.

శ్రీకాళహస్తి మండలంలో కేటాయింపులు ఇలా:: ఎస్‌టి పురుషులకు బి.వెంకటాపురం, ఎస్‌టి మహిళకు వాగివీడుఎస్‌సి పురుషులకు అమ్మపాళెం, గుంటకింద పల్లి,పోలిలను రిజర్వ్ చేసారు. ఎస్‌సి మహిళలకు ఓబులాయిపల్లి, చల్లపాళెం, అన్‌రిజర్వ్‌డ్ పురుషులకు అక్కుర్తి, కలవగుంట, కాపుగున్నేరి, వేడాం అన్‌రిజర్వ్‌డ్‌మహిళలకు కొదండరామాపురం, ముచ్చివోలు, గోవిందరావు పల్లి, ఎగువ వీధి, మండలాధ్యక్ష పదవికి అన్‌రిజర్వ్‌డ్ అభ్యర్థులకు ఓకేటాయించారు. జడ్‌పిటిసి ఎస్ సి మహిళలకు కేటాయించారు.

శ్రీకాళహస్తి ఏర్పేడు మండలాల్లో రాజకీయంగా పరిశీలిస్తే శ్రీకాళహస్తి మండలంలో కూటమికి అభ్యర్థుల కొరత లేదు. అంతేకాక కూటమిలో ఏ స్థానం ఎవరికి కేటాయించాలనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.దాంతో ఆశావహులను స్థానిక నాయకుడు అందరి అభిప్రాయాలను తీసుకుంటున్నారు.ఈ మండలంలో ఎంపిపి స్థానం అన్‌రిజర్వ్‌డ చేసారుకాబట్టి బహుశా మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయాదవ్‌కు అవకాశం ఉండవచ్చు.ఇక వైకాపా తరఫున చెవిరెడ్డి మధుసూధనరెడ్డి ఉండవచ్చుననే ఊహాగానాలు సాగుతున్నాయి.ఇక ఏర్పేడు మండలం మండలాధ్యక్ష పదవిని బిసిలకు కేటాయించారు. ఇందుకు రెండు పార్టీల్లో ఎవరు నెగ్గుకొస్తారు అనే పరిశీలన జరుగుతుంది.

## యాజమాన్య పద్ధతులతో మామిడి దిగుబడి

పెనుమూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:




మామిడిలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతుల్లో నాణ్యమైన అధిక దిగుబడి పొందవచ్చునని జిల్లా ఉద్యాన అధికారి సతీష్ సూచించారు. మామిడి దిగుబడిపై బుధవారం మండలంలోని జెట్టిగుండ పల్లిలో మామిడిలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు హాజరైన ఉద్యానశాఖ అధికారి సతీష్ మాట్లాడుతూ మామిడిలో 25 శాతం కొమ్మలను కత్తిరించడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చునన్నారు. అలాగే పురుగుల మందు అవశేషాలు లేని మామిడికాయలకు తొడుగులను కవర్స్ వినియోగించి రసాయన మందుల పిచికారిలను తగ్గించుకోవడం ద్వారా పురుగు మందు అవశేషాలు లేని నాణ్యమైన మామిడి పండ్ల ఎగుమతి చేసి అధిక రాబడి పొందవచ్చునన్నారు. మామిఇ తోటలో పునరుద్ధరణ, తల మార్పిడి, మట్టి పరీక్షా, ధర, ఎరువుల వాడకం, పచ్చిరొట్టె పైర్ల పెంపకం యొక్క ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. మామిడి చెట్ల కొమ్మలను కత్తిరించి తోటల్లో యూరియా 10 గ్రాములు, సూక్ష్మ పోషకాల మిశ్రమం ఐదు గ్రామాలు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లైతే కొత్త చిగురు త్వరగా పెరిగి పూత తొందరగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈపిఎఫ్ వేతర పరిమితి పెంపు

చిత్తూరుహెల్త్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈపిఎఫ్ఓ వేతర పరిమితిని రూ.25 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రీజినల్ పీఎఫ్ కమీషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. తప్పనిసరి కవరేజీకి వర్తించే వేతన పరిమితిని నెలకు రూ.15 వేల నుండి రూ.25 వేలకు పెంచినట్లు ఆయన తెలిపారు. ఈ వేతన పరిమితి 2026 సెప్టెంబర్ 17వ తేదీ నుండి అమల్లోకి వచ్చిందని, కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉద్యోగుల జీతం రూ.15 వేలకు మించినా ఈపిఎఫ్ పరిధిలోకి రావడం లేదని, దీంతో భవిష్యనిధి, పెన్షన్, సంబంధిత బీమా రక్షణకు వారు దూరంగా వుండాల్సి వస్తోందన్నారు.

## పక్కాగా కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు

గుడిపాల, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహ ణకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో పోలింగ్ ముగిసే వరకు ఎన్నికల సంఘం జారీ చేసిన కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కాగా అమలులో వుంటుందని గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు మండలంలో వున్న వారి వారి పార్టీలకు చెందిన బ్యానర్లు, కటౌట్లు, ఇతర ఫ్లెక్సీలు, జెండాలను వారే స్వచ్ఛంధంగా తీసి వేయాలన్నారు. అలా తీసి వేయకుండా వున్నట్లైతే మోడల్ ఆఫ్ కండక్ట్ కింద చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎన్నికల పోలింగ్ సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కల్గించే చర్యలకు దూరంగా వుండాలన్నారు.

## కుప్పంలో ఎంపిటిసి సెగ్మెంట్ రిజర్వేషన్లు ఇలా !!

కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త

కుప్పం మండలంలోని 21 ఎంపిటిసి సెగ్మెంట్ల రిజర్వేషన్ వివరాలను ఆర్డీఓ షేక్ మహ్మద్ హుసేన్ ఖరారు చేశారు. దాసేగానూరు సెగె ్మంట్ జనరల్, చెక్కునత ్తం, మల్లానూరు 1, నూలుకుంట, కొటాలూరు, మంకలదొడ్డి జనరల్ మహిళ, మిట్ట పల్లి, కెడిపల్లి, మల్లా నూరు 3, ఉర్లఓబనపల్లి బిసి మహిళలకు రిజర్వు అయ్యాయి. పైపాళ్యం, అడవిబూదుగూరు, వెండుగంపల్లి, జరుగు, పిబి నత్తం సెగ్మెంట్లు జనరల్ కేటగిరీకి రిజర్వు చేశారు. కంగుంది1, నడిమూరు బిసి, కంగుంది 3, మల్లానూరు 2 బిసి, కంగుంది 2 ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు.

## జడ్పీటిసి అభ్యర్థిత్వం ఆశిస్తున్న ఉయ్యాల

శాంతిపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



శాంతిపురంలో తెలుగుదేశం పార్టీ తరపున జడ్పీటిసి అభ్యర్థిత్వాన్ని తెదేపా సీనియర్ నేత ఉయ్యాల జయరాంరెడ్డి ఆశిస్తున్నారు. ఈసంద ర్భంగా ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ తమ కుటు ంబం సిఎం చంద్రబాబునాయుడుకి అంకితభావంతో పనిచేస్తుందన్నారు. తమలాంటి వ్యక్తులకు ఇంతవరకు ఎలాంటి అవకాశం రాలేదని ఈదఫా జడ్పీటిసి జనరల్ కేటగిరీకి ఖరారు కావడంతో తమకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. మండలనేతలు, కార్యకర్తలు కూడా సహకరించాలని కోరారు.గత ంలో ఉయ్యాల జయరాంరెడ్డి హంద్రీ-నీవా జలాలు రాకపోవడంపై అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పట్ల తీవ్ర నిరసన తెలిపి రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు కారణమయ్యారు.

## షూటింగ్‌బాల్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు విజయం

కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



గుంటూరు జిల్లా తాడిగొండలో జరిగిన అంతర్ జిల్లాల షూటింగ్‌బాల్ బాలికల ఛాంపియన్‌షిప్ 2026 పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు విజయం సాధించింది. ఈసందర్భంగా బాలికల జట్టును జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ అంబా మహేష్ అభినందించారు. బాలికల జట్టు ఛాంపియన్‌షిప్ సాధించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. ఈసందర్భంగా బాలికలకు శిక్షణ ఇచ్చిన పిఇటిలు శేఖర్, వేణు, స్వాతిలను అభినందించారు.

## శాంతిపురంలో ఎంపిటిసి సెగ్మెంట్ల రిజర్వేషన్లు ఇలా

శాంతిపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త

శాంతిపురం మండలంలోని 18 ఎంపిటిసి సెగ్మెంట్ల రిజర్వేషన్లను ఆర్డీఓ ఖరారు చేసినట్లు ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ తెలిపారు. మఠం, గుంజార్లపల్లి, చెంగుబళ్ల, శివరాంపురం సెగ్మెంట్లు బిసిలకు రిజర్వు అయ్యాయి. అలాగే చిన్నారిదొడ్డి, రాళ్లబూదుగూరు, 121పెద్దూరు, కెనమాకులపల్లి, కడపల్లి జనరల్ మహిళలకు ఖరారు చేశారు. గుంజార్లపల్లి బిసి, 64 పెద్దూరు, బండపల్లి బిసి మహళ, కర్లగట్ట జనరల్, అబకలదొడ్డి ఎస్సీ మహిళ, ఎంకెపురం, అనికెర, కొలమడుగు జనరల్, చెంగుబళ్ల బిసి, దండికుప్పం ఎస్సీలకు రిజర్వు చేశారు.

## అంగన్‌వాడీ కేంద్రం వద్ద మహిళల నిరసన



వి.కోట, అక్టోబర్ 14 ప్రభాతవార్త

మండలంలోని నక్కనపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మహిళలు నిరసన తెలిపారు. ఇక్కడ పనిచే స్తున్న అంగన్‌వాడీ కార్యకర్త అలివేలమ్మ రెండు నెలలక్రితం అనారోగ్యంతో మృతి చెందిందన్నారు. కాగా కార్యకర్త పోస్టుతో పాటు పలు సెంటర్లకు హెల్పర్ల నియామకంకు ఉన్నతాధికారులు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. దీంతో గ్రామంలో ఉన్న ఓసి మహిళకు కార్యకర్త పోస్టును కేటాయించారని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన కార్యకర్త ఎస్సీ అని అదే సామాజిక వర్గం వారికి కేటాయించలేదని పేర్కొన్నారు. అధికారులు ఇతర ప్రాంతాల మహిళలకు ఇక్కడ నియమించడం తగదని పేర్కొన్నారు.

## లక్ష్మీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి

రామకుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా సందర్భంగా అమ్మవారు బుధవారం లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అమ్మవారికి పుష్పాలు, కాసుల నాణేలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకుని భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిపారు.

## అదానీ గ్రూప్‌చే యాభైవేల ఆర్థికసాయం

కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలో అమలు చేస్తున్న పి4బంగారు కుటుంబాలు కార్యక్రమంలో భాగంగా వరమనూరు గ్రామంలో లక్ష్మమ్మ అనే మహిళకు అదానీ గ్రూప్ యాభైవేల ఆర్థికసాయం అందించింది. ఈ నగదుతో లక్ష్మమ్మ గ్రామంలో చిల్లరకొట్టు ఏర్పాటుచేసుకోగా బుధవారం తెదేపా నేతలు ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మమ్మ సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పోరేషన్ డైరెక్టర్లు చెక్కునత్తం మణి, శరవణ, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, నేతలు మహేంద్ర, సంతోష్, శరవణ, మురళి, నాగరాజు, జయప్ప, ప్రభు, బాలాజీ పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న ప్రముఖులు

కాణిపాకం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు తమిళనాడు రాష్ట్ర మంత్రి వి.సంపత్‌కుమార్, అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణలు వేర్వేరుగా కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయంలో రాజగోపురం వద్ద ఆలయ సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రవి, బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మంచి వ్యక్తిత్వం, ప్రజల్లో ఆదరణ వున్న వారికి మేయర్ అభ్యర్థిత్వం

### - రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరీ

చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



చిత్తూరు మేయర్ అభ్యర్థిగా కూటమి పార్టీల తరపున మంచి వ్యక్తిత్వం, ప్రజల్లో ఆదరణ వున్న వ్యక్తికి కేటాయించాలని జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, సిఎం నారా చంబ్రాబునాయుడును రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరీ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు మేయర్ అభ్యర్థిత్వంను మాజీ ఎమ్మెల్యే సికె బాబు కుటుంబానికి కేటాయిస్తే చిత్తూరులో మళ్ళీ అరాచకం తలెత్తే అవకాశాలు వున్నాయన్నారు. 2003 సంవత్సరంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్న సమయంలో చిత్తూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా వున్న సికె బాబు తన కుమారుడు రవిశంకర్ చౌదరిని హత్య చేశారని ఆరోపణలు వున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యాబాబుకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిత్వం కేటాయించాలని భావించడం సరికాదన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుని కూటమి పార్టీల తరపున మంచి వ్యక్తిత్వం వున్న వారికి మేయర్ అభ్యర్థిత్వం కేటాయించాలని ఆమె కోరారు.

## 'దేశం' మేయర్ అభ్యర్థిత్వం కోసం సత్తా చాటిన కాజూరు ద్రాక్షాయణి

చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ నుండి చిత్తూరు అభ్యర్థిత్వం ఆశిస్తున్న జిల్లా తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాజూరు బాలాజీ సతీమని కాజూరు ద్రాక్షాయణి బుధవారం తనకు తెలగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థిత్వం కేటాయించాలని చిత్తూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు బిఆర్ అంబేద్కర్ భవన్‌లో బుధవారం జరిగిన బిసీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ తరపున మేయర్ అభ్యర్థిత్వం ఆశిస్తున్న కాజూరు ద్రాక్షాయణి కాజూరు నుండి 2 వేల మంది మహిళలతో అంబేద్కర్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాజూరు ద్రాక్షాయణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసీలను గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నడు లేని విధంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి బిసీ పక్షపాతి ప్రభుత్వంగా ప్రసిద్దికెక్కిందన్నారు. ఈ ర్యాలీలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుకాజూరుబాలాజీ,బిజెపినాయకులుఅల్లూరి శ్రీనివాసులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

### - చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర




పెనుమూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: మండల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర హెచ్చరించారు. పెనుమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఇన్స్‌పెక్టర్ రామచంద్ర పెనుమూరు ఎస్ఐ శ్రీకాత్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ రామచంద్ర మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడానికి ఇప్పటి నుండి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసు శాఖ తరపున అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ రామచంద్ర, ఎస్ఐ శ్రీకాంత్‌లు మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద వున్న మౌళిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాలు, శాంతిభద్రతలకు సంబంధించి పలు అంశాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

## ఎంపిటిసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు

బంగారుపాళ్యం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

బంగారుపాళ్యం మండల ఎంపిటిసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. మండలంలో 21 ఎంపిటిసీ స్థానాలు వుండగా 10 ఎంపిటిసీ స్థానాలు మహిళలకు, 11 ఎంపిటిసీ స్థానాలు జనరల్‌కు కేటాయించారు. ఇందులో బంగారుపాళ్యం-1 ఎస్సీ జనరల్, బంగారుపాళ్యం-2 బిసీ జనరల్, బోడబండ్ల జనరల్(మహిళ), చీకూరుపల్లి ఎస్సీ(జనరల్), గుంతూరు బిసీ(మహిళ), జంబువారిపల్లి జనరల్(మహిళ), కీరమంద ఎస్టీ, మహాసముద్రం ఎస్సీ(మహిళ), మొగిలి జనరల్, నల్లంగాడు జనరల్, నలగాంపల్లి జనరల్, పాలేరు ఎస్సీ(మహిళ), రాగిమానుపెంట జనరల్ మహిళ, సంక్రాంతిపల్లి జనరల్ మహిళ, శెట్టేరి జనరల్ మహిళ, టేకుమంద జనరల్, తగ్గువారిపల్లి-1 బిసీ మహిళ, తగ్గువారిపల్లి-2 ఎస్సీ జనరల్, తంబుగానిపల్లి ఎస్సీ మహిళ, తుంబ జనరల్, తుంబకుప్పం జనరల్ స్థానాలుగా రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. కాగా ఎంపిపి స్థానం ఎస్సీ జనరల్‌కు కేటాయించగా, జడ్పీటిసీ స్థానం ఓసీ మహిళకు కేటాయించారు.

## మొగిలీశ్వరాలయంలో నవరాత్రి ఉత్సవాలు

బంగారుపాళ్యం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలోని మూల విరాట్ కామాక్షమ్మ అమ్మవారికి బుధవారం చందన అలంకరణ నిర్వహించారు. అంతకు ముందు అర్చకులు దండపాణి గురుకుల్, రెడ్డప్ప గురుకుల్ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం కామాక్షమ్మ దేవి ఆలయం నందు మహాదీపారాధాన, ప్రత్యేక అలంకరణతో పాటు సప్తకన్నికలకు ప్రత్యేక పూజా కార్యక్ర మాలు చేశారు. ఈ పూజలకు ఉభయదారులుగా మండల తెలుగు దేశం గౌరవ అధ్యక్షులు ఎన్‌పి జయప్రకాష్, మాజీ ఎంపిపి సుచిత్రలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కమలనాధరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

### - పోలింగ్ స్టేషన్ల తనికీలో అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్ బాషా



చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: త్వరలో జరుగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి పోలీసు శాఖ ముందస్తు చర్యలు తీసుకొంటోందని అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్‌బాషా చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణతో కలిసి గురువారం చిత్తూరు నగర పరిధిలోని కొంగారెడ్డిపల్లి గాండ్లపల్లి పాఠశాలలోని పోలింగ్ కేంద్రంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన ప్రత్యేక భద్రతా ఏర్పాట్లపై పోలీసు శాఖ దృష్టి సారిస్తోందన్నారు. డిఎస్పీ వెంకట నారాయణ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోందని, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పోలీసు శాఖ నిత్యం పర్యవేక్షిస్తుందన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజలు ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ మహ్మద్ హాషం, వన్‌టౌన్ ఎస్ఐ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## తెలుగుదేశం పార్టీకి బిసిలే వెన్నుముక

### - భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు - ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్



చిత్తూరురూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీని దివంగత నందమూరి తారకరామారావు బిసిల అభ్యున్నతే లక్ష్యంగా స్థాపించారనీ, నాటి నుంచి నేటి వరకు బిసిల బలమే తెలుగుదేశం పార్టీకి బలమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ స్పష్టం చేసారు. బుధవారం చిత్తూరు బిసి భవన్‌లో కూటమి పార్టీల ఆద్వర్యంలో నిర్వహించిన బిసి ఆత్మీయ సమ్మేళ నంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడుతున్న బిసిలకు ఉన్నత పదవులు కల్పించడమే వారి పట్ల టిడిపికి వున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజనతో బిసిలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్దిని వేగవంతం చేస్తోందన్నారు. మేయర్ అభ్యర్థిగా అధిష్టానం ఎవరినీ ఎంపిక చేసినా, కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కూటమినాయకులు, బిసి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఆర్‌కె విద్యార్థిని ఎంపిక

చిత్తూరురూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, ఆర్‌కె విద్యాలయ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని సుమేరా అన్సారీ సయ్యద్ టెన్నీస్ గేమ్స్ బాలికల అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో మూడవస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం రమేష్‌బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నేతృత్వంలో 2025-26 సంవత్సరానికి 70వ అంతర్ జిల్లాల టెన్నిస్ గేమ్స్ పోటీలు శ్రీకాళహస్తి పట్టణంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని విశేష ప్రతిభ కనబరచి ఈనెల 23న న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కళాశాల మేనేజింగ్ ట్రస్టీ డా.డిఎ కల్పజ జాతీయస్థాయి జరిగే క్రీడల్లో అన్సారీ విజయం సాధించాలని అభినందిస్తూ ఆశీర్వదించారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ

చిత్తూరురూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త:



చిత్తూరునగరం, ఇరువారం వద్ద విదయత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ భూమి పూజ చేసారు. బుధవారం ఉదయం విద్యుత్‌శాఖ ఆద్వర్యంలో రూ.1.60కోట్ల రూపాయలతో33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. నగర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాలో భాగంగా సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాగా అంతకుముందు 31వ వార్డు టెలిఫోన్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో రూ 40.30లక్షలతో నిర్మించిన సిమెంట్‌రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, స్థానిక కూటమినాయకులు పాల్గొన్నారు.

## స్థానిక పోరుకు పలమనేరు సమాయత్తం

పలమనేరు, అక్టోబర్ ప్రభాతవార్త :



స్థానిక పోరుకు పలమనేరు సమాయత్తమైంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ జారీ చేయను ఉండడంతో పోటీకి ఆశావహులు సై అంటున్నారు త్వరలో మునిసిపల్ జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు నగారా మోగనుంది. పలమనేరు మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా అధికార ప్రతిపక్షాలకు సంబంధించి 72 మంది పోటీ చేసే అవకాశం ఉంది ఇంకా స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు ఇక పలమనేరు మున్సిపాలిటీని జనరల్ మహిళలకు కేటాయించారు మున్సిపాలిటీలో మొత్తం 42500 మంది ఓటర్లు ఉండగా మహిళా ఓటర్లు 21,884 మంది పురుష ఓటర్లు 20 616 మంది ఉండగా 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు ఇక ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పలమనేరు మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా పది పంచాయితీలు ఉన్నాయి బైరెడ్డిపల్లి మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలకు 21 పంచాయతీలు గంగవరం మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలకు 16 పంచాయితీలు పెద్దపంజాణి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలకు 25 పంచాయితీలు ఉన్నాయి నియోజకవర్గ మొత్తంలో 83 ఎంపీటీసీ స్థానాలకు 90 పంచాయితీలకు ఎన్నికలు జరగనున్నాయి ఇందులో వీకోట మండలంలో అత్యధికంగా 25 ఎంపీ స్థానాలు స్థానాలు ఉన్నాయి ఇక పలమనేరు మండలంలో ఎంపీపీ స్థానం జనరల్ మహిళలకు పెద్దపంజాణి మండలం ఎంపీపీ స్థానం బీసీ మహిళలకు బైరెడ్డిపల్లి మండలం ఎంపీపీ స్థానం జనరల్ మహిళలకు గంగవరం ఎంపీపీ స్థానం బీసీ మహిళకు కేటాయించారు అలాగే జడ్పిటిసి స్థానాలకు సంబంధించి పలమనేరు మండలం జనరల్ వీకోట మండలం బిసి పెద్దపంజాణి మండలం జనరల్ గంగవరం మండలం బైరెడ్డిపల్లి మండలం బీసీలకు కేటాయించారు

## పలమనేరులో మెగా మెడికల్ క్యాంప్

పలమనేరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త :




ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు పలమనేరు ఏరియా ఆసుపత్రిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు డి ఎం హెచ్ ఓ అసిస్టెంట్ బి ఎం హెచ్ ఓ ప్రధాన వైద్యాధికారి మమతారాణి ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు చికిత్సల కోసం భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు బీపీ షుగర్ క్యాన్సర్ థైరాయిడ్ వంటి వ్యాధులతో పాటు ఇతర సాధారణ వ్యాధులకు కూడా చికిత్సలు నిర్వహించారు అలాగే ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి వాకింగ్ వ్యాయామం మెడిటేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తూ ఈ మేధా వైద్య శిబిరం నిర్వహించారు.

## స్మశాన స్థలం సమస్య పరిష్కారం

### తక్షణమే స్పందించిన తహసీల్దార్

పలమనేరు. అక్టోబర్ 14. ప్రభాత వార్త :



స్మశాన స్థలం సమస్య పరిష్కారంపై పలమనేరు తాసిల్దార్ రమేష్ రెడ్డి తక్షణం స్పందించారు. మండలం లోని మండపేట కోటూరు ఎస్సీ కాలనీ స్మశాన స్థలం వివాదంలో ఉంది కొందరు గ్రామస్తులు ఈ స్థలంలో శవాలు ఖననం చేయకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై దళిత నాయకులు చంద్రకుమార్ కత్తి శ్రీనివాసులు జై భీమ్ సభ్యుడు కిషోర్ కుమార్ ఈనెల 12న తాసిల్దార్ కు ఫిర్యాదు చేశారు దీనిపై స్పందించిన తాసిల్దార్ బుధవారం స్మశాన స్థలానికి వెళ్లి సర్వే చేయించారు ఈ స్థలాన్ని ఎవరైనా అడ్డుకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు దీంతో సమస్య పరిష్కారం అయింది సర్వేలో స్మశాన స్థలానికి హద్దులు ఏర్పాటు చేశారు ఇందుకు దళిత నాయకులు తాసిల్దార్ కు కృతజ్ఞతలు తెలిపారు తాసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం ఎక్కడైనా ఆక్రమణకు గురైతే తన దృష్టికి తేవాలని సూచించారు.

# తిరుపతి రూరల్‌లో సర్పంచుల రిజర్వేషన్ల ఖరారు!

- 34 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్ల జాబితా విడుదల....
- బీసీలకు 11, ఓసీలకు 17, ఎస్సీలకు 5, ఎస్టీలకు ఒక స్థానం....
- మహిళలకు 17 పంచాయతీలు.. పురుషులకు 17 స్థానాలు..

**తిరుపతి రూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తిరుపతి రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులకు రిజర్వేషన్ల జాబితా వెల్లడైంది. మండల పరిధిలోని మొత్తం 34 గ్రామ పంచాయతీలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలతో పాటు మహిళలకు కేటాయించిన రిజర్వేషన్ల వివరాలు జాబితాలో పొందుపరిచారు. దీంతో ఆయా గ్రామాల్లో స్థానిక ఎన్నికలపై రాజకీయ వర్గాలు, ఆశావహుల్లో చర్చ మొదలైంది. సర్పంచుల రిజర్వేషన్ జాబితాను తిరుపతి ఆర్ డి ఓ ప్రకటనలో విడుదల చేశారు

### బీసీలకు అత్యధికంగా 11 స్థానాలు....

రిజర్వేషన్ల వివరాల ప్రకారం బీసీ వర్గానికి 11 సర్పంచ్ స్థానాలు కేటాయించారు. వీటిలో మహిళలకు ఆరు, పురుషులకు ఐదు స్థానాలు ఉన్నాయి. ఓసీ (అన్‌రిజర్వుడ్) విభాగానికి 17 స్థానాలు కేటాయించగా, మహిళలకు తొమ్మిది, పురుషులకు ఎనిమిది స్థానాలు దక్కాయి. ఎస్సీ వర్గానికి ఐదు స్థానాలు కేటాయించగా, మహిళలకు రెండు, పురుషులకు మూడు స్థానాలు ఉన్నాయి. ఎస్టీ వర్గానికి ఒక స్థానం కేటాయించగా, అది పురుషుల విభాగంలో ఉంది.

### మహిళలకు 17 పంచాయతీలు....

మండలంలోని మొత్తం 34 గ్రామ పంచాయతీల్లో సగం అంటే 17 పంచాయతీల సర్పంచ్ పదవులు మహిళలకు కేటాయించారు. మిగిలిన 17 స్థానాలు పురుషుల విభాగంలో ఉన్నాయి. అందుబాటులో ఉన్న జాబితా ప్రకారం అవిలాల, కేపీ పేట, ముండ్లపూడి, పాడిపేట, పేరూరు, పుడిపట్ల గ్రామ పంచాయతీలు బీసీ మహిళలకు కేటాయించారు. బ్రాహ్మణపట్టు, శెట్టిపల్లి ఎస్సీ విభాగానికి, తిరుచానూరు ఎస్సీ విభాగానికి, తిరుమలనగర్ ఎస్టీ విభాగానికి కేటాయించినట్లు జాబితాలో పేర్కొన్నారు. చిగురువాడ ఎస్సీ మహిళలకు కేటాయించగా, దుర్గసముద్రం, గొల్లపల్లి, కుంట్రపాకం, లింగేశ్వరనగర్, మల్లంగుంట, పెరుమాళ్లపల్లి, సాయినగర్, వేదాంతపురం, వెంకటపతినగర్ గ్రామ పంచాయతీలు ఓసీ మహిళల విభాగంలో ఉన్నాయి. సి.మల్లవరం, గాంధీపురం, పేడిపల్లె, రామానుజపల్లె, సప్తగిరి కాలనీ గ్రామ పంచాయతీలు బీసీ విభాగంలో ఉన్నాయి. చెర్లోపల్లె, మంగళం, ఓటేరు, పద్మావతిపురం, పాతకాల్వ, రణధీరపురం, శ్రీనివాసపురం, తనపల్లె గ్రామ పంచాయతీలు ఓసీ విభాగంలో ఉన్నాయి. తుమ్మలగుంట ఎస్సీ మహిళల విభాగంలో ఉంది.

### ఆశావహుల్లో మొదలైన సమీకరణాలు....

రిజర్వేషన్ల కేటాయింపుతో ఏ గ్రామంలో ఏ వర్గానికి అవకాశం లభించిందనే అంశంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. సర్పంచ్ పదవులను ఆశిస్తున్న వారు తమ గ్రామాల్లో రిజర్వేషన్‌కు అనుగుణంగా రాజకీయ సమీకరణాలు, మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించే అవకాశం ఉంది. అయితే ఎన్నికల షెడ్యూల్, నామినేషన్లు, ఇతర అధికారిక ప్రక్రియలపై సంబంధిత అధికారుల ప్రకటనలే కీలకం కానున్నాయి.

## టిడిపి నేతలు వైకాపాలో చేరిక



**పెద్దపంజాణి, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**
మండలంలోని శివాడి గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు ఆర్లప్ప,జాన్‌పాల్ బుధవారం మాజీ ఎమ్మెల్యే,వైకాపా జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటేగౌడ సమక్షంలో తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్ఆర్ పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా వారిని వెంకటేగౌడ పార్టీకండువాలుకప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్లప్ప,జాన్‌పాల్ వంటి సీనియర్ నాయకులు పార్టీలోకి రావడంతో పార్టీమరింత బలోపేతం చెందుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఉధ్యాన పథకాలకోసం రైతులునమోదు చేసుకోవాలి

**17లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి –ఉధ్యాన అధికారి వరప్రసాద్.**



**పెద్దపంజాణి, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**
గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో (సమగ్ర ఉద్యాన కేంద్రం) భాగంగా రైతులకు వివిధ ఉద్యానవన పథకాలు అందించేందుకు రిజిస్ట్రేసన్లు ప్రారంభించినట్లు ఉద్యాన అధికారి వరప్రసాద్ పేర్కొన్నారు.అక్టోబర్ 12 నుంచి 17వ తారీకు వరకు అర్హులైన రైతులు తమ సమీప రైతుసేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.కొత్తపండ్ల తోటల ఏర్పాటు,పాత మామిడి తోటల పునరుద్దరణన, కోల్డ్‌రూములు,ప్రాసెసింగ్ యూనిట్లు,పాలీహౌస్‌లు, పవర్‌టిల్లర్లు,బ్యాటరీ స్ప్రేయర్లు,మినీ ట్రాక్టర్లు,ఫారంపాండ్లు,ప్లాస్టిక్ క్రేట్లు తదితర పథకాల ద్వారా లబ్దిపొందవచ్చున్నారు.రాజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు,పట్టాదారు పాసుబుక్కు,బ్యాంకు ఖాతా వివరాలు అందించాలని సూచించారు.రైతులుసద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి కోరారు.

## రెండు పాఠశాలలకు డిఇఓ షోకాస్ నోటీసులు

**రైల్వే కోడూరు రూరల్ అక్టోబర్ 14 ప్రభాతవార్త::**
రైల్వేకోడూరు మండలంలో శివరామకృష్ణ వెనుక భాగంలో ఉన్న ఒక పాఠశాల లో దసరా సెలవుల్లో పాఠశాల నిర్వహిస్తున్న సందర్భంలో అదేవిధంగా బలిజి వీధి సమీపంలో ఉన్న ఒక ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో కూడా క్లాసులు నిర్వహిస్తున్న సందర్భంలో సమాచారం తెలుసుకున్న తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ రెండు పాఠశాలలకు షోకస్ నోటీసులను అందజేసినట్లు తెలిసింది. ఇటీవల కాలంలో రైల్వేకోడూరు మండలంలో ఉన్నత అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి యదేచంగా పాఠశాలలను నిర్వహించడం విడ్డూరంగా ఉందని,అయితే పాఠశాలలను గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎంతటి వారైనా జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాలను పాటించకపోతే రానున్న రోజుల్లో ధర్నాలు, రాస్తారాకోలు పాఠశాలల వద్దే నిర్వహిస్తామని వారు అన్నారు.

## గ్రామాలలో భూకబ్జాల జోరు

**అడ్డుకున్న తహసిల్దార్ బృందం**

**రైల్వే కోడూరు రూరల్ అక్టోబర్ 14 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు మండలంలోని వివి కండ్రిక గ్రామంలో అనంతరాజు పేట గ్రామంలో దారిని కొంతమంది బహిరంగంగా ఆక్రమించుకున్న విషయాన్ని కోడూరు తాహసిల్దార్ అమర్నాథ్ కు తెలియడంతో హుటాహుటిన సంఘటన స్థలాన్ని కి చేరుకొని భూకబ్జాదారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూములను ఎవరైనా అక్రమంగా ఆక్రమణ చేస్తే తప్పకుండా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే రైల్వేకోడూరు మండలంలో పలుచోట్ల భూకబ్జాలను అడ్డుకొని ఆక్రమించిన భూముల్లో నోటీసు బోర్డులను పెట్టినట్లు వారు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను కాపాడుతామని ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ లక్ష్మీదేవి, సర్వేర్ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు పెద్దపీటగా...

**చిట్వేలి, అక్టోబర్ 14, ప్రభాతవార్త:**
చిట్వేలి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ మహిళలకు పెద్దపీట వేయడం విశేషం.బుధవారం విడుదల చేసిన జాబితా ప్రకారం మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీకి ఒకటి, ఎస్సీకి రెండు, బీసీకి మూడు, జనరల్ కేటగిరీకి ఆరు స్థానాలు కేటాయించారు. వీటిలో ఆరు స్థానాలు మహిళలకు రిజర్వు చేశారు. ఎంపీటీసీ రిజర్వేషన్ వివరాలు ఇలా ఉన్నాయి.రాజుకుంట–బీసీ మహిళ, నగిరిపాడు–జనరల్, మాలేమార్పురం–ఎస్సీ మహిళ, తుమ్మకొండ–బీసీ, తిమ్మయ్యగారిపల్లి–జనరల్, నాగవరం–ఎస్సీ, కంపసముద్రం–జనరల్ మహిళ, చిట్వేలి1–బీసీ మహిళ, చిట్వేలి2–జనరల్, మైలపల్లి–జనరల్ మహిళ, కె.ఎస్. అగ్రహారం–జనరల్ మహిళ, సి.ఎం. రాచపల్లి–ఎస్టీ. కాగా సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఎస్టీలకు 2, ఎస్సీలకు 4, బీసీలకు 4, జనరల్ కేటగిరీకి 11 స్థానాలు కేటాయించారు.
జనరల్: సి. కందులవారిపల్లి, చిట్వేలి, మైలపల్లి, నక్కలపల్లి, నగిరిపాడు, పొల్లోపల్లి.
జనరల్ మహిళలు: సి.ఎం. రాచపల్లి, కె.ఎస్. అగ్రహారం, రాజుకుంట, తిమ్మయ్యపాలెం, తుమ్మకొండ.బీసీ: మార్గోపల్లి, మాలేమార్పురం.
బీసీ మహిళలు: చెర్లోపల్లి, నాగవరం.
ఎస్సీ: కంపసముద్రం, తిమ్మయ్యగారిపల్లి.
ఎస్సీ మహిళలు: దేవమాచుపల్లి, కె.వి.ఆర్.ఆర్. పురం.ఎస్టీ: మహారాజాపురం.
ఎస్టీ మహిళ: నేతివారిపల్లి రిజర్వేషన్లు ఖరారు కావడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. సర్పంచ్, ఎంపీటీసీ పదవులను ఆశిస్తున్న నాయకులు తమకు అనుకూలమైన పరిస్థితులపై అంచనాలు వేస్తూ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు.

## పూర్ణాహుతితో ముగిసిన చండీయాగం



**రామచంద్రాపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**
కొత్తకండ్రిగ సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమంలో బుధవారం పూర్ణాహుతితో చండీయాగం ముగిసింది. ఈ సందర్భంగా వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ వరుణయాగం, చండీయాగాలను మూడు రోజుల పాటు నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు కైలాష్ గురూజీ అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఆశ్రమ ప్రాంగణం భక్తిపారవశ్యంతో మారుమ్రోగింది. పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులకు గురూజీ తీర్థప్రసాదాలు అందజేశారు.

## రాయలచెరువు రైతులకు న్యాయం చేయాలి

**కేవీబీపురం, అక్టోబరు 14 ప్రభాతవార్త:**
కేవీబీ పురం మండలంలోని రాయల చెరువు నిర్వాసిత బాధ్యత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో రాయలచెరువు నిర్వాసిత రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ కిసాన్ సంఘ రాష్ట్ర కార్యదర్శి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి పాదర్తి రాజారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల చెరువుకు గండిపడి, పంట పొలాలు దెబ్బతిని, ఇసుక మేటలు, బండరాళ్లు ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోతే 11 నెలలు గడుస్తున్నప్పటికీ ఇంత వరకు రైతుల ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ కాలేదని, అలాగే గతంలో ఒక సారి మారుతీ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగినప్పటికీ ఇదే విషయమై మూడు సార్లు కిలెక్టర్‌ని కలవడంతో గత నెల 19వ తేదీ తిరుపతి జిల్లా కలెక్టర్ రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని సాంకేతిక కారణాల వల్ల ఆగిందని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటికీ పరిష్కారం కాలేదని అందు వల్లనే ధర్నా నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. జూన్ 26వ తేదీ జిల్లా వ్యవసాయ అధికారి, స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం రైతులకు చెక్కులు పంపిణీ చేస్తామని చెప్పి రెండు రోజుల్లో అందరి రైతు ఖాతాలోకి నగదు జమవుతాయని చెప్పారు. కానీ ఇంత పరిష్కారం కాలేదని ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరోసారి చొరవ తీసుకుని ఎలాంటి పొరపాట్లు జరగకుండా న్యాయబద్ధంగా రైతులకు రావలసిన నగదు, సబ్సిడీ నష్ట పరిహారాన్ని వెంటనే వచ్చేటట్లు ప్రయత్నం చేసిరైతులకు న్యాయం చేయాలని రాజారెడ్డి జరిగింది. గండి పడినచెరువుకు ఇరిగేషన్ అధికారులు వెంటనే చొరవ తీసుకుని శాశ్వత పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. ఇప్పటికే రెండు సార్లు పంట పెట్టుకునే అవకాశం రైతులు కోల్పోయారని ఇది గమనించి అధికారులు వర్షాలు ప్రారంభం కాకముందే పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువు కింద నిర్వాసిత రైతులు బ్యాంకుల్లో తెచ్చుకున్న బకాయిలను వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే మరోసారి రైతులుతో కలసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, రాయలచెరువు నిర్వాసిత బాధ్యత రైతులు పాల్గొన్నారు.

## శ్రీ కామాక్షి శివ పూజ అలంకరణలో ఆరేటమ్మ



**పుత్తూరురూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త:**
పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ గ్రామదేవత ఆరేటమ్మ శ్రీ కామాక్షి శివ పూజ అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేసి, సాయంత్రం ప్రత్యేక పుష్పాలతో శ్రీ కామాక్షి శివపూజ అలంకరణలో అలంకరించారు.

పట్టణంలోని ద్రౌపదీదేవి ఆలయం, ఓంశక్తి ఆలయం, శ్రీ కామాటఇసమేత, సదాశివేశ్వర స్వామి ఆలయం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, మండలపరిధిలోని తిరుమల కుప్పం శ్రీ అంకాల పరమే శ్వరి అమ్మవారు, తొరూరు పోలా క్షమ్మ దేవాలయంలోని అమ్మవార్లను వివిధ అలంకరణలతో అలంకరించి పూజలు చేశారు. మండల పరిధిలోని కణంమిట్ట గ్రామంలో వెలసిన దక్షిణ ఖాళీ వారాహి అమ్మన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు హోమాలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజర య్యారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా జరగాలి

**– జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం సీపీఎం**

**పుత్తూరురూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త:**
పుత్తూరు మున్సిపాలిటీ కార్యాలయంలో తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌రావు, పుత్తూరు తహసీల్దార్ జి.సి.వెంకటేశ్వరులు, పుత్తూరు మున్సిపల్ కమిషనర్ డి.వి.నాగేశ్వరరావులకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నామినేషన్ వేసే అభ్యర్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందజేయాలని, మద్యం, డబ్బులు ఎన్నికల్లో అరికట్టాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణ శాంతిభద్రతలు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు తాగునీరు, వైద్యం, మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఓటర్లను మభ్యపెట్టి భయాందోళనకు గురిచేయకూడదని, ఎన్నికలు శాంతియుతంగా ప్రజాస్వామ్య బద్ధంగా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పై సమస్యలపై స్పందించిన తిరుపతి జాయింట్ కలెక్టర్ శాంతియుతంగా ఎన్నికలు జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, నందయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రొంపిచెర్ల మండలంలో సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు

**రొంపిచెర్ల, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**
రొంపిచెర్ల మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఎన్నికల కమిషన్ కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం జాండ్లవారిపల్లి పంచాయతీని ఎస్సీకి, బోడిపాటివారిపల్లి, రొంపిచెర్ల పంచాయతీలను బీసీ మహిళ లకు కేటాయించారు. పెద్దమల్లెల, చెంచమరెడ్డిగారి పల్లి పంచాయతీలను బీసీ లకు కేటాయించగా, బండకింద పల్లి, బొమ్మయ్యగారి పల్లి, పెద్దగొట్టిగల్లు, చిచ్చిలివారి పల్లి, మోటుమల్లెల, గానుగచింత గ్రామ పంచాయతీలను అన్‌రిజర్వుడు కేటగిరీగా ప్రకటించారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆయా గ్రామాల్లో సర్పంచి పదవులకు పోటీ చేయాలనుకునే ఆశావహుల్లో ఆసక్తి నెలకొంది.

## అగ్రిగోల్డ్ బాధితులు బాండ్లు వెరిపికేషన్ హాజరుకావాలి :సిఐ

**నింద్ర, అక్టోబరు 14 ప్రభాతవార్త :**
అగ్రిగోల్డ్ బాధితులు డిపాజిటర్లు,ఏజెంట్లు బాండ్లు వెరిఫికేషన్‌లో భాగంగా ఈనెల 17వతేది శనివారం చిత్తూరులోని యస్‌పి కార్యాలయానికి హాజరుకావలెనని నగరి రూరల్ సిఐ వి.భాస్కర్ తెలిపారు.బుదవారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు మండలంలో వున్నవారు 17వతేదిన ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు చిత్తూరు పిసిఆర్ కళాశాల ఎదురుగా ఉన్న యస్‌పి కార్యాలయంలో సిఐడి అధికారులు బాండ్లును పరిశీలించనున్నట్లు తెలిపారు.అగ్రిగోల్డ్ బాధితులు తమ యొక్క ఒరిజనల్ బాండ్లుతో పాటు కలర్ జిరాక్స్ పత్రులపై సంతకం చేసి సమర్పించాలని అన్నారు.వాటితో పాటు ఆధార్,పాన్‌కార్డుల జిరాక్స్ పత్రులపై సంతకాలు చేసి అందజేయాలన్నారు.ఈకార్యక్రమంలో నింద్ర యస్‌ఐ మల్లీఖార్జున్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పోటు వర్కర్‌లకు పదోన్నతి



**తిరుమల,అక్టోబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:**
శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదాల తయారీలో నాణ్యత ప్రమాణాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేసే దిశగా టిటిడి కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా దీర్ఘకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 13 మంది పోటు వర్కర్ సీనియర్లకు పోటు సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించింది. బుధవారం తిరుమల శ్రీవారి ఆలయంలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి పదోన్నతి ఉత్తర్వులను అందజేశారు.

## కూష్మాండ అలంకరణలో చతుర్ధ దుర్గ

**వైభవంగా “శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి” నవరాత్రి ఉత్సవాలు**




**చంద్రగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**
కూష్మాండ అలంకరణలో చతుర్ధ దుర్గ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ పంచాయతీలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి సూరీ స్వామి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల గంటల వరకు అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి 9 గంటల నుండి 12 గంటల వరకు కూష్మాండ– హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణతో దేధీప్యమానంగా ముస్తాబు చేశారు. అమ్మవారి సేవకు తిరుపతికి చెందిన యమహా షోరూమ్ డి.శ్రీదర్, డి.మాలిని, ముంబాయికి చెందిన శ్రీకాంత్, సౌమ్య అద్వైత్ దాతలుగా వ్యవహరించారు.

## శ్రీభువనేశ్వరీ దేవి అలంకరణలో మరకతశక్తి కాళీదేవి

**రామచంద్రాపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**



రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తి పీఠంలో దశ మహావిద్య దేవతల దివ్యజ్వాలలో భాగంగా బుధవారం శ్రీభువనేశ్వరీ దేవి అలంకరణలో శ్రీమరకత శక్తి కాళీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. కుర్తాళం పీఠాధిపతి సిద్దేశరానంద మహాభారతి స్వామి ఆధ్వర్యంలో రమ్యానందభారతి అమ్మవారికి పంచామృతాభిషేకం, వివిధ రకాల హోమాలు నిర్వహించారు. విశిష్ట పూజ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. శ్రీమూర్తులకు సువాసినీ పూజ చేపట్టారు. ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుండి విశేష సంఖ్యలో పాల్గొని గురుదేవతల అనుగ్రహాన్ని పొందారు. కళాకారులచే గానకచేరి, మరకతశక్తి అమ్మవారికి దర్బారు సేవ నిర్వహించారు.


**కెనరా బ్యాంక్ Canara Bank**

**స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్**
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణీ నగర్, అవిలాల, తిరుపతి-517501. ఫోన్ : 79016 26759, 88806 88884

**స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 06.11.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**ఇ-వేలం తేది: 06.11.2026, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు**
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 05.11.2026, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీతలు : శ్రీ కె సుబ్రహ్మణ్యం, తండ్రి: లేటు కె చెంగయ్య, ఫ్లాట్ నెం. 101, శ్రీ లక్ష్మి టవర్స్, ఫ్లాట్ నెం. 82 & 83, సర్వే నెం.502, పేరూరు గ్రామ అకౌంట్స్, టీచర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్, నందనగర్, తిరుపతి-517501 మరియు హామీదారు: శ్రీమతి కలవగుంట సుగుణ, భర్త: శ్రీ కె సుబ్రహ్మణ్యం, డి.నెం. 10-437, క్రాంతినగర్, జీవకోన, తిరుపతి-517501.

బకాయి మొత్తం : తేది. 30.09.2026 నాటికి రూ.51,03,751.53 + తేది. 01.10.2026 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఛార్జీలు.

బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :

ఎ-షెడ్యూల్ : చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్, తిరుపతి రేణిగుంట సబ్-డిస్ట్రిక్, తిరుపతి రూరల్ మండలం, నెం.53, పేరూరు గ్రామ అకౌంట్స్, "శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ" వారి "టీచర్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ" లే-అవుటు పేరుతో, నలందనగర్, సర్వే నెం.502, ప్లాట్ నెం. బి2 & బి3 నందు 11495.97 చ॥అ॥లు లేదా 1277.33 చ॥గ॥లు లేదా 319.33 అంకణములు. హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.బి1, పడమర: ఎస్ శ్రీరామన్‌కు చెందిన ప్లాట్ నెం.84, ఉత్తరం: 33 అ॥ల రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం. ఎ1, ఎ2 & ఎ3. కొలతలు: తూర్పు-పడమర: ఉత్తరంవైపుగా 102.1 అ॥లు లేదా 31.2 మీ॥లు, తూర్పు-పడమర: పడమరవైపుగా 118.14 అ॥లు లేదా 36.01 మీ॥లు, ఉత్తరం-దక్షిణం: తూర్పువైపుగా 82.83 అ॥లు లేదా 25.1 మీ॥లు, ఉత్తరం-దక్షిణం: పడమరవైపుగా 98.42 అ॥లు లేదా 30.01 మీ॥లు, విస్తీర్ణం: 11495.97 చ॥అ॥లు లేదా 1277.33 చ॥గ॥లు లేదా 319.33 అంకణములు.

బి-షెడ్యూల్ : పైన తెలిపిన మొత్తం 1277.33 చ॥గ॥లలో నిర్మించిన "శ్రీ లక్ష్మి టవర్స్ అలియాస్ శ్రీ లక్ష్మి నారాయణ టవర్స్" అపార్ట్‌మెంట్‌లోని అవిభాజ్యపు వాటా భూమి 25.04 చ॥గ॥లు, సౌకర్యాలు, కామన్ ఏరియాలు మొదలగు వాడుకొనే అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో.

సి-షెడ్యూల్: శ్రీ లక్ష్మి టవర్స్ అలియాస్ శ్రీ లక్ష్మి నారాయణ టవర్స్" పేరుతో గల రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్, 1వ అంతస్తులోని కామన్ ఏరియాలు కలుపుకొని నిర్మాణపు ఏరియా 1147 చ॥అ॥లు కలిగిన ఫ్లాట్ నెం.101. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం & ఫ్లాట్ నెం.102, ఉత్తరం: శూన్యాకాశం, దక్షిణం: ఉమ్మడి వరండా.

**రిజర్వు ధర: రూ. 16,74,000/-** **ధరావత్తు సొమ్ము: రూ. 1,67,400/-**

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 79016 26759, 88806 88884.
* బిడ్డర్లు తమ ఆఫర్‌లను ఆస్తి రిజర్వు ధర ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 14.10.2026, ప్రదేశం : తిరుపతి — సం/– అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


# స్థానిక పోరుకు సిద్ధంగా వుండాలి

## చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



**రామచంద్రాపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**
వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక పోరుకు సిద్ధంగా వుండాలని చంద్రగిరి నియోజకవర్గ సమన్వయ కర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దేసూరు కండ్రిగ, సొరకాయలపాళ్యం, కెకెవి పురం, నెన్నూరు గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంతో పోరాడి స్థానిక ఎన్నికల్లో విజయ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో అమలుకాని అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన టిడిపి నాయకులు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యకర్తలకు చివరి వరకు అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. అనంతరం గుర్తి ంపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, మహిరెడ్డి, రాజేష్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# పనపాకం వద్ద మృత్యుకుహరంగా మారిన జాతీయ రహదారి!

పాకాల, అక్టోబర్ 14 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా పరిధిలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి (ఎన్‌హెచ్–140)పై పనపాకం వద్ద ప్రయాణం ప్రమాదకర రంగా మారింది. అసంపూర్తి ఫ్లైఓవర్, అస్తవ్యస్తంగా ఇరుకుగా మారే రహదారి, వరుస స్పీడ్ బ్రేకర్లు వాహనదారులకు ప్రాణసంకటంగా పరిణమించాయి. ఇప్పటికే పలువురు ప్రమాదాల్లో మృతిచెందగా, మరెందరో గాయపడినట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**ఆరు లేన్ల రహదారి.. ఒక్కసారిగా ఇరుకు మార్గం!**

విశాలమైన ఆరు లేన్ల రహదారి ఫ్లైఓవర్ సమీపంలో 300–400 మీటర్ల మేర ఇరుకుగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

**అసంపూర్తి ఫ్లైఓవర్.. అస్తవ్యస్త రహదారి.. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం!**

**కలెక్టర్ గారూ.. పనపాకం హైవేపై తక్షణమే దృష్టి సారించండి!**

**స్పీడ్ బ్రేకర్లు.. హెచ్చరికలు కరువు!**

అతి తక్కువ దూరంలో వరుసగా ఉన్న స్పీడ్ బ్రేకర్లకు తగిన హెచ్చరిక బోర్డులు, రేడియం సూచికలు, బారికేడ్లు, వీధి దీపాలు లేకపోవడం ప్రమాదాల ముప్పును పెంచుతోంది. నిబంధనలకు అనుగుణంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి, తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి!**

వరుస ప్రమాదాలు జరుగుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరో ప్రాణం బలయ్యే వరకు వేచి చూడకుండా జిల్లా కలెక్టర్ స్పందించి, ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు, సంబంధిత రహదారుల శాఖ అధికారులతో సమన్వయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయడంతోపాటు, తాత్కాలిక భద్రతా ఏర్పాట్లు వెంటనే చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎన్నికల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- కమిషనర్ ఎం.జయకృష్ణ.

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త



తిరుపతి నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికలను ఎన్నికల నియమావళి, నిబంధనలకు అనుగుణంగా అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై బుధవారం ఆర్.ఓలు, ఏ.ఆర్.ఓలతో నగరపాలక సంస్థ కార్యాలయం లో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేటి నుండి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ నుండి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అధికారులు అందరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పకుండా పాటించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద అప్రమత్తతతో వ్యవహరిస్తూ, ఎన్నికల ప్రక్రియలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్స్ నిబంధనలకు సంబంధించిన పుస్తకాలను శ్రద్ధగా చదివి ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వకుండా నామినేషన్ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, భరత్ నాయక్, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తహసీల్దార్ సురేష్ బాబు, ఆర్.ఓ లు, ఏ.ఆర్.ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమీషన్ సూచనల మేరకు విధులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు సిబ్బంది ఎన్నికల కమీషన్ సూచనల మేరకు విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆర్ఓలు, ఏఆర్ఓలు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సమగ్ర అవగాహన కలిగి వుండాలన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నగర పాలక సంస్థ మేయర్, వార్డు సభ్యులు 2026 ఎన్నికల విధులు కేటాయించబడిన ఆర్ఓలు, ఏఆర్ఓలకు మాస్టర్ ట్రైనర్లతో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సిబ్బంది సిద్ధంగా వుండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఆర్‌లో పాత్ర కీలకమని, రిటర్నింగ్ అధికారి హోదాలో విధులు నిర్వహిస్తున్న వారు వార్డుల్లో తప్పులు జరిగితే దానికి ఆర్ఓను పూర్తి బాధ్యత వహించాల్సి వుంటుందన్నారు. ఎన్నికల విధులను ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వర్తించాలని, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన క్షణం నుండి ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందని, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఎన్నికల అధికారుల బృందం అంతా కలసికట్టుగా పని చేయాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ కోసం అంతా సిద్ధం చేసుకోవాలని, నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా ఎన్నికల నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. నామినేషన్ల తిరస్కరణకు సంబంధించి స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని, తిరస్కరించిన నామినేషన్లపై ఒక కమిటీ విచారణ చేస్తుందన్నారు. చిత్తూరు నగర పాలక పరిధిలో మొత్తం 15 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 60 డివిజన్లకు సంబంధించి ఈ కేంద్రాల్లోని నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఏర్పాట్లను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని, ఆర్ఓలు, ఏఆర్ఓలు ఎలక్ట్రోరల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, సహాయ కమీషనర్ ప్రసాద్, డిఎల్‌డిఓ రవికుమార్, మేయర్ రిటర్నింగ్ అధికారి పుల్లారెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారి సునీల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కుప్పంలో మొదలైన అభ్యర్ధుల వేట

– అభ్యర్థుల ఎంపికకై తెదేపా.. వైకాపా నేతల కుస్తీ !!

కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకరమైన కుప్పం మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల కోసం వేట మొదలైంది. ఇటు అధికార తెలుగుదేశం పార్టీ అటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు వార్డుల్లో నిలబడే కౌన్సిలర్ అభ్యర్థులపై కసరత్తులు ప్రారంభించారు. మున్సిపాలిటీలో 32 వార్డులు ఉండగా ఎస్టీలకు ఒకటి, ఎస్సీ మహిళలకు మూడు, ఎస్సీ జనరల్‌కు మూడు వార్డులు కేటాయించారు. అలాగే బిసి మహిళలకు నాలుగు, బిసి జనరల్‌కు ఐదు, జనరల్ మహిళలకు తొమ్మిది, జనరల్ కేటగిరీలో ఏడు వార్డులు రిజర్వు అయిన విషయం విదితమే. ప్రధాన ంగా మున్సిపల్ పరిధిలో రిజర్వేషన్ల పర ంగా 16 వార్డులు అంటే యాభైశాతం సీట్లు మహిళలకే రిజర్వు అయ్యాయి. దీంతో ఆయా పార్టీల తరఫున ఉన్న నేతల కుటుంబీకులైన మహిళలను ఎన్నికల్లో నిలబెట్టేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. దీనిపై తెదేపా, వైకాపా నేతలు కుస్తీలు పడుతున్నట్లు సమాచారం. ఆయా వార్డుల్లో ఉన్న పార్టీల నాయకులతో కీలక నేతలు సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిసింది. ఈనెల 16నుంచి నామినేషన్లు సీ్వకరించనున్న నేపథ్యంలో నేటిసాయంత్రం కల్లా అభ్యర్థుల ఎంపికను ఓ కొలిక్కి తేవాలని ప్రధాన పార్టీల ముఖ్య నేతలు కసరత్తులు చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపికకు కూడా చాలా తక్కువ సమయం మాత్రమే పార్టీలకు మిగిలింది.

## విజయపురం మండలంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

విజయపురం, అక్టోబరు 14 ప్రభాతవార్త:



దసరా పండుగను పురస్కరించుకుని బుధవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించినటువంటి త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను చిత్తూరు జిల్లా విజయపురం మండలంలోని ఇళ్ళత్తూరు, కొత్తూరు వెంకటాపురం, ఎం అగరం, జంబాడ తదితర గ్రామాల్లో ప్రచార వాహనం ద్వారా త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథముల ప్రచారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మఅనే మూడు ఆత్మల వివరమే భగవద్గీతలో ముఖ్యమైన జ్ఞానం అని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు సభ్యులు చింత సుబ్రహ్మణ్యం, భవానమ్మ, రమణయ్య, పద్మమ్మ, వెంకటరాముడు, యాదవ్, నారాయణలు పాల్గొన్నారు.

## అన్నపూర్ణగా అవనాక్షమ్మ, లలితా మహా త్రిపురసుందరిగా కామాక్షాంభిగా

నారాయణవనం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :



మండలంలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో దేవి నవరాత్రి ఉత్సవాల్లో నాల్గవ రోజు బుధవారం అమ్మవార్లు వివిధ రకాల రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అరణ్యంకండ్రిగ పంచాయతీ పరిధి కైలాసనాథకోనలో వెలసిన కామాక్షాంభిగా అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఉదయం లలితా మహా త్రిపురసుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. అంతకుముందు ఆలయాన్ని శుద్ధి చేసిన తర్వాత అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే భక్తిశ్రద్ధలతో జలపాతంలో స్నానం చేశారు. సముదాయం వెలసిన టిటిడి ఆలయం అవనాక్షమ్మ అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నారాయణవనం ద్రౌపతీదేవి అమ్మవారు కరిమారిమ్మ అలంకరణలో, నారాయణవనం క్రాస్‌లో వెలసిన అవనాక్షమ్మ ఆలయంలోను అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు వెంకట శివ ప్రసాద్, షరాబు భరత్ తదితరులు పాల్గొన్నారు.

## 11 ఎపిటిసి స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటన : ఎంపిడిఓ

నారాయణవనం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :

నారాయణవనం మండలం జడ్పీటీసీ స్థానం బిసీ మహిళకు కేటాయించగా, ఎంపిపి స్థానం ఎస్సీ మహిళకు కేటాయించారు. మండలంలోని 11 ఎంపిటిసి స్థానాలకు ఎంపిడిఓ అరుణ బుధవారం రిజర్వేషన్లను ప్రకటించారు. కొండలచెరువు ఎస్సీ మహిళ, ఎరికంబట్టు అన్ రిజర్వుడు, నారాయణవనం–1 అన్ రిజర్వుడు మహిళ, నారాయణవనం–2 అన్ రిజర్వుడ్, నారాయణవనం–3 బిసి మహిళ, వెంకటకృష్ణాపాలెం అన్ రిజర్వుడ్ మహిళ, కశింమిట్ట ఎస్సీ, కీళగరం అన్ రిజర్వుడ్, అరణ్యకండ్రిగ ఎస్టీ, తుంబూరు ఎస్సీ, పాలమంగళం ఉత్తరం అన్ రిజర్వుడుకు కేటాయించారు.

## వారాహీదేవిగా గంగమ్మ

తిరుపతి,అక్టోబర్ 14ప్రభాతవార్త:



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో బుధవారం తాతయ్య గుంట గంగమ్మ వారాహీదేవి అలంకా రంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంట లకు ఊంజల్‌సేవకు ఉభయదాతలు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ ,ఈఓ ఎ. జయకుమార్ దర్శన ఏర్పాట్లు చేశారు.

## స్థానిక పోరుకు తలక్రిందులైన రిజర్వేషన్లు

చంద్రగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

చంద్రగిరి, కొటాల, తొండవాడ మినహా మిగిలిన వాటిలో పోటీకి సిద్ధమవుతున్న నాయకులకు రిజర్వేషన్ల ప్రక్రియ తలక్రిందుల చేసింది. ఎంపిపి జనరల్ కేటగిరిలో కొనసాగించగా, జడ్పీటిసి జనరల్ మహిళకు కేటాయించారు. గతంలో చంద్రగిరి సర్పంచ్ ఎస్సీ మహిళకు కేటాయింగా ఈ దఫాలో బిసి కేటాయించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ దుబాసి రామమూర్తి పోటీకి అత్యంత ఆసక్తి కనబరుస్తున్నారు. అదేవిధంగా కొటాల సర్పంచ్ గతంలో ఎస్సీ మహిళకు కేటాయించగా ఈ దఫా అన్ రిజర్వ్‌డ్ మహిళకు కేటాయించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ సింగు సుధ గత ఎన్నికలలో వైసిపి అభ్యర్థి ఎంపిటిసి అభ్యర్థికి గట్టి పోటీ ఇచ్చారు. మరి ఇప్పుడు జనరల్ మహిళకు కేటాయించినందున సర్పంచ్‌గా పోటీకి ముందుకు వస్తారా అనేది వేచి చూడాలి. తొండవాడ సర్పంచ్ గతంలో అన్ రిజర్వ్‌డ్ మహిళకు కేటాయించగా ఈ దఫా అన్ రిజర్వ్‌డ్ చేశారు. ఇక్కడ అధికార పార్టీ నుండి పోటీకి పులికంటి మోహన్ రెడ్డి, జగన్‌మోహన్ నాయుడు పేర్లు ప్రముఖంగా వినబడుతున్నాయి. టిడిపికి ప్రత్యర్థులుగా రెడ్డి సామాజిక వర్గంతో పాటు యాదవ సామాజిక వర్గం సైతం పోటీకి వచ్చే అవకాశం వుందంటున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో జడ్పీటిసి స్థానాలను పరిశీలిస్తే చంద్రగిరి, పాకాల, ఎర్రావారిపాళ్యం మహిళలకు కేటాయించారు. అదేవిధంగా చిన్నగొట్టిగల్లు, తిరుపతి, రామచంద్రాపురం స్థానాలను జనరల్‌కు కేటాయించారు. ఎంపిపి స్థానాలను పరిశీలిస్తే చిన్నగొట్టిగల్లు, ఆర్.సి.పురం మహిళలకు కేటాయించారు. అదేవిధంగా ఎర్రావారి పాళ్యం స్థానాన్ని బిసి జనరల్‌కు కేటాయించగా, తిరుపతి రూరల్ బిసి మహి ళకు కేటాయించారు. అదే విధంగా పాకాల, చంద్రగిరి ఎంపిపి స్థానాలను జనరల్ కేటగిరికి కేటాయించారు. దీంతో ఎంపిటిసిలు, సర్పంచ్‌ల స్థానాలలో ఊహించని రీతిలో రిజర్వేషన్లు ఖరారు కావడటంతో నాయకులు, కార్యకర్తలు అవాక్కయ్యారు. ఇందులో కొంత మంది బ్రతుకుజీవుడా అనుకున్న వారు వున్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇంటి నివాస స్థలాలు

– టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి హెల్త్, అక్టోబర్ 14 ప్రభాతవార్త



అర్హులైన పేదలందరికీ ఇంటి నివాస స్థలాలు ఇవ్వడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య లక్షణం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఇల్లు లేని ఉద్యోగస్తులు, రిటైర్ ఉద్యోగస్తులు, కార్మికులకు, చేతివృత్తుల వారికి, ఆటో డ్రైవర్, టాక్సీ డ్రైవర్స్, టైలర్స్, చేతి వృత్తుల వారికి, మేస్త్రీలకి, నిరుపేద బ్రాహ్మణులకు, ఇంటి స్థలాల కేటాయింపు ధ్యేయంగా పనిచేస్తున్న ఎన్డీఏ కూటమి, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కృషి చేస్తున్నారు అని చెప్పారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుండి కూడా ఇల్లు లేని నిరుపేదల నుంచి ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు,ఎవరైతే ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారో వాళ్ళందరికీ కూడా ఇంటి నివాస స్థలాలు ఇచ్చే విధంగా కూడా రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నివాస స్థలాలు ఇస్తుందని పేర్కొన్నారు.తిరుపతిలో ముఖ్యంగా మొన్ననే టిటిడి ఉద్యోగస్తులకు సంబంధించి వాళ్ళకి కేటాయించిన ఇండ్ల స్థలాలకు సంబంధించి టిటిడి పరంగా సుమారు 230 కోట్ల రూపాయలు అందులో 80 కోట్ల రూపాయలు ఉద్యోగస్తులు భరించే విధంగా ఎవరైతే ప్లాట్లు పొందారో వాళ్ళ యొక్క వాటా కింద అవన్నీ డెవలప్ చేసే విధంగా కూడా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా కూడా ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. అదేవిధంగా తిరుపతిలో ఎవరైతే ఈ యొక్క టిటిడి ఉద్యోగస్తుల్లో కూడా చాలామంది రిటైర్ అయిన వాళ్ళు కూడా ఇంకా కూడా హౌస్ సైట్స్ ఇవ్వాల్సిన అవసరం ఉందని, వీరికే కాకుండా అనేకమంది పేద, మధ్యతరగతి వాళ్ళందరికీ కూడా ఇంటి నివాస స్థలాలు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ప్రతి నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ కూడా ఎన్డీఏ కూటమి అభ్యర్థులని, తిరుపతిలో మేయర్ అభ్యర్థికి, 66 డివిజన్‌లలో కార్పొరేటర్స్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. రాబోయే రోజుల్లో తిరుపతి ప్రశాంతతను కాపాడాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలన్నారు.

# తిరుపతి డివిజన్

## ఏడేళ్లుగా కొలిక్కిరాని సందు దారి వివాదం!

న్యాయం చేయాలంటూ తహసీల్దార్‌ను ఆశ్రయించిన రామకృష్ణాపురం వాసులు



రేణిగుంట, అక్టోబర్ 14, ప్రభాతవార్త:

రేణిగుంట మండలం గురవరాజుపల్లి పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురంలో సందు దారి వివాదం ఏడేళ్లుగా పరిష్కారానికి నోచుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వే నంబర్ 462/6 పరిధిలోని 10 అడుగుల వెడల్పు, 64 అడుగుల పొడవు గల సందు దారిని ఆక్రమించారంటూ బాధితులు బుధవారం రేణిగుంట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను కలిసి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. రామకృష్ణాపురంలోని ప్లాట్ నంబర్ 128 వద్ద ఉన్న సందు దారిని ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో దారి వినియోగంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తమ సమస్యను పరిష్కరించాలని గత ఏడేళ్లుగా రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులను కోరుతున్నామని బాధితులు తెలిపారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ వివాదం కొలిక్కి రాకపోవడంతో చివరకు తహసీల్దార్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.సందు దారికి సంబంధించిన సమస్యను అధికారులు ఇకనైనా తీవ్రంగా పరిగణించి పరిష్కరించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులను సమీక్షించి, నిబంధనల ప్రకారం దారి హద్దులను నిర్ధారించాలని కోరారు. ఏడేళ్లుగా కొనసాగుతున్న వివాదానికి శాశ్వత పరిష్కారం చూపి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.ఈ మేరకు కాళప్ప భార్గవ్, హర్షవర్ధన్, శారద, వరలక్ష్మి, చంద్రమ్మ తదితరులు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ వివాదంపై తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను విలేకరులు వివరణ కోరగా, దారి ఆక్రమణకు గురైన విషయం వాస్తవమేనని తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, సంబంధిత రికార్డులను పరిశీలించి న్యాయాన్యాయాలను విచారించిన అనంతరం దారి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. చట్టం అందరికీ సమానమేనని, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## శ్రీసిటీ ఎన్ఎస్ ఇన్‌స్ట్రామెంట్స్ పరిశ్రమ వితరణ





సత్యవేడులో బీసీ బాలుర కళాశాల హాస్టల్ రెండో నూతన భవనం ప్రారంభం

సత్యవేడు, అక్టోబరు 14 ప్రభాతవార్త:

శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రామెంట్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా సత్యవేడులోని బీసీ బాలుర కళాశాల హాస్టల్‌కు రెండో నూతన భవనాన్ని నిర్మించింది. రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని బుధవారం సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కొబయాషి, శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. గతంలో శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉంటూ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వారి సమస్యలను గుర్తించిన శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో ఎన్ఎస్ ఇన్‌స్ట్రామెంట్స్ సంస్థ ముందుకొచ్చి, గత ఏడాది నవంబరులో రూ.50లక్షల వ్యయంతో తొలి హాస్టల్ భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. దానికి కొనసాగింపుగా మరో రూ.50 లక్షలతో రెండో దశ భవనాన్ని నిర్మించింది. దీంతో విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ ఇన్‌స్ట్రామెంట్స్ సంస్థ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులు, సంబంధిత సిబ్బంది నూతన వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి పి.వెంకటేశ్వరులు, ఎన్ఎస్ ఇన్‌స్ట్రామెంట్స్ డీజీఎం సంజయ్, హాస్టల్ సంక్షేమ అధికారి రామయ్య, ఎన్ఎస్ సంస్థ, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహాచండి దేవి అలంకారంలో అంకమ్మ ఎల్లమ్మ తల్లి



చిన్నగొట్టిగల్లు, అక్టోబరు 14 ప్రభాతవార్త:

చిన్నగొట్టిగల్లు మండలం లంకపల్లివారిపల్లిలో వెలసిన అంకమ్మ ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని మహాచండి దేవి అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలకడ మండలం కదిరేచెరువు గ్రామం చెరువు ముందరపల్లికి చెందిన లంకిపల్లి గుర్నాథ్ నాయుడు, మంజుల దంపతులతో పాటు లంకపల్లివారిపల్లికి చెందిన లంకిపల్లి కాంతమ్మ, శేషాద్రి నాయుడు తమ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహాచండి దేవి కృపతో, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆలయ వర్గాలు ఆకాంక్షించాయి

## వడమాలపేట మండలంలో రిజర్వేషన్ల ఖరారు

వడమాలపేట, అక్టోబరు 14 ప్రభాతవార్త:

వడమాలపేట మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ కేటాయించారు. వడమాలపేట ఎంపీపీ(జనరల్)కి కేటాయించారు. జడ్పీటీసీ ఎస్సీ(మహిళ)కి కాగా మండలంలో 9 మంది ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఏఎం పురం(ఎస్టీ), ఎస్‌బీఆర్ పురం ఎస్సీ(జనరల్), పూడి ఎస్సీ(మహిళ), పాదిరేడు బీసీ(మహిళ), వడమాలపేట తిరుమణ్యం జనరల్(మహిళ), పత్తి పుత్తూరు, బాలినాయుడు కండ్రిగ, ఎస్‌వీ పురం జనరల్‌గా కేటాయించారు. సర్పంచ్‌ల రిజర్వేషన్లు వడమాలపేట మండలంలోని 18 పంచాయతీల్లో రిజర్వేషన్‌లు ఖరారయ్యాయి. పంచాయతీల వారిగా ఏఎం పురం ఎస్టీ జనరల్, పాదిరేడు, పూడి ఎస్సీ జనరల్, బాలినాయుడు కండ్రిగ, కదిరిమంగళం ఎస్సీ మహిళ, కాయం, పూడి బీసీ జనరల్, టీసీ అగ్రహారం, అప్పలాయగుంట బీసీ మహిళ, ఓబీఆర్‌కండ్రిగ, పత్తిపుత్తూరు, బంగారెడ్డి కండ్రిగ, ఎస్వీ పురం జనరల్,లక్ష్మమ్మ కండ్రిగ, బట్టికండ్రిగ, ఎస్‌బీఆర్ పురం, తిరుమణ్యం, వడమాలపేట జనరల్ మహిళకు రిజర్వు చేశారు. మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా బీసీలకు కేవలం ఒక్కటి మాత్రమే కేటాయించడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## మీనాక్షిదేవి అలంకరణలో వాసవీదేవి



వడమాలపేట, అక్టోబరు 14 ప్రభాతవార్త:

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మీనాక్షిదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి దేవి దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం పంచామృత అభిషేకం చేశారు. సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని మీనాక్షిదేవి రూపంలో పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. పురోహితులు ప్రసాద్‌శర్మ మంత్ర పుష్పంతో వేదమంత్రాలు పటిస్తూ మంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## నారాయణవనం మండలంలో రిజర్వేషన్ల వివరాలు ఇలా..

***నారాయణవనం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :*** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబందించి బుధవారం ఎపిడిఓ అరుణ 19 పంచాయతీలకు సంబందించి సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లను ప్రకటించారు. సర్పంచ్ స్థానాలకు అరణ్యకండ్రిగ పంచాయతీ అన్ రిజర్వుడు, భీమునిచెరువు అన్ రిజర్వుడు మహిళ, బొప్పరాజుపాలెం ఎస్టీ, బ్రాహ్మణాతాంగేల్ అన్ రిజర్వుడ్ మహిళ, దిగువకనపాలెం ఎస్సీ, ఎరికంబట్టు అన్ రిజర్వుడు, కల్యాణపురం ఎస్సీ, కశింమిట్ట అన్ రిజర్వుడు, కీళగరం అన్ రిజర్వుడు, కొండలచెరువు అన్ రిజర్వుడు మహిళ, నైనారుకండ్రిగ బిసి, నారాయణవనం అన్ రిజర్వుడు, పాలమంగళం దక్షణం అన్ రిజర్వుడు మహిళ, పాలమంగళం ఉత్తరం ఎస్సీ, సముదాయం బిసి మహిళ, తిరువట్యం ఎస్సీ మహిళ, తుంబూరు అన్ రిజర్వుడు మహిళ, వెంకటకృష్ణాపాలెం బిసి

# శ్రీకాళహస్తి డివిజన్

## వైష్ణవి దేవి అలంకారంలో వాసవి అమ్మవారు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 14 ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు ఆకట్టుకునే అలంకారాలతో ముస్తాబు చేస్తున్నారు. బహాదూరుపేటలోని ఆలయంలోనూ, బజారు వీధిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ అలంకారాలు ఆదరహో అన్నట్లు మారాయి. ఈ నేపథ్యంలో బజారువీధిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారిని వైష్ణవీదేవి అలంకారం నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవారిని దర్శించున్నారు. ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అన్నదానాలు నిర్వహిస్తున్నారు. ఆలయ చైర్మెన్ జూలుగంటి మురళి పర్యవేక్షణలో సహచరుల సహకారంతో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

## కారణ్ణిలో శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి కళ్యాణోత్సవం



బుచ్చినాయుడు కండ్రిగ,అక్టోబర్ 14 ప్రభాతవార్త: కారణ్ణి గ్రామంలో వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి కళ్యాణ్ ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది ఐదవ సినిమాలను పురస్కరించు కొని గ్రామంలో ప్రత్యేక పుష్ప అలంకరణ విద్యుత్ దీపాలు వేద పండితులచే కళ్యాణ మహోత్సవం కార్య నిర్వాహకులు ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించి ఘనంగా కళ్యాణోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ మాసంలో ప్రతి గ్రామంలోని హిందువులు గ్రామంలోని దేవాలయాల్లో, ఇండ్లలో భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వర స్వామి పూజలు నిర్వహించి ముక్కులు చెల్లించుకోవడం జరుగుతుంది అందులో భాగంగానే నేడు కారని మిట్ట గ్రామంలో గ్రామస్తులు, కార్తీక్ నాయుడు కలిసికట్టుగా శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి కళ్యాణోత్సవమును నిర్వహించడం జరిగింది ఈ మాసంలో తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలకు ఎంతో గొప్ప ప్రఖ్యాతత ఉంటుంది అందుకే వెంకటేశ్వర స్వామి మాలధారులను ధరించి దీక్షపూని ఆంధ్రప్రదేశ్లోని భక్తులతో పాటు ముఖ్యంగా తమిళ రాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో స్వామి దర్శనానికి వస్తుంటారు ఈ కార్యక్రమంలో కార్తీక్ నాయుడు, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## అమ్మవారికి చండీ అలంకారం



ఏర్పేడు,అక్టోబర్ 14 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను ఆకర్షణీయంగా నిర్వహించటంలో చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఇఓ మునిశేఖర్లు సమన్వయంతో పని చేస్తూ మహిళా భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం అమ్మవారిని చండీఅమ్మవారి అలంకారం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరై పూజలు నిర్వహిస్తున్నారు. వచ్చిన మహిళా భక్తులు ఇబ్బంది పడకుండా సదుపాయాలను కల్పించారు. బుధవారం ఉత్సవానికి ఉభయదారులుగా కోడూరుకు చెందిన డాక్టర్ లోక్యనాయక్, విజయలక్ష్మీ వారి కుటుంబసభ్యులు హాజరయ్యారు.

## అగ్ని ప్రమాదంలో... ప్రాణ నష్టం తప్పింది



తొట్టంబేడు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం తాటిపర్తి పరిసర ప్రాంతంలో ఉన్న ఈయా మెటల్స్ పరిశ్రమలో ఇటీవల చిన్నపాటి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వార్తలు రావడంతో అధికారులు వెంటనే స్పందించారు. తహసీల్దార్ భారతి ఎస్ఐ బి బాలకృష్ణ ఫీల్డ్ స్టాఫ్తో కలిసి పరిశ్రమను పరిశీలించినట్లు వారు తెలిపారు. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం, గాయాలు జరగలేదని స్పష్టం చేశారు. పరిశ్రమలో షెడ్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో పైపులకు వెల్డింగ్ చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిరి పక్కనే ఉన్న వ్యర్థ ప్లాస్టిక్ గోనె సంచులపై పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అవి క్రమంగా మంటలుగా మారాయి. ఘటన జరిగిన సమయంలో కార్మికులందరూ మధ్యాహ్న భోజనానికి వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయాన్ని గమనించిన కంపెనీ సీఈఓ అప్రమత్తమై కార్మికుల సహాయంతో వెంటనే మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉందని, కార్మికుల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని యాజమాన్యం తెలిపింది.

### ఎన్నికల కోడ్ అమలులో వుంది...

## అన్ని పార్టీలు సహకరించాలి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో వచ్చినందున అన్ని పార్టీలు నిబంధనలు పాటించాలని, ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కెవి క్రిష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో, బస్స్టాప్లు వద్ద రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీ బోర్డులు, కటౌట్లు, జెండాలు, హోర్డింగులు వుంచకూడదని, వెంటనే తొలగించాలని తెలిపారు. ప్రచార ప్రయోజనాల కోసం ప్రభుత్వ వాహనాలు, ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ సిబ్బందిని వినియోగించరాదని, ప్రభుత్వ నిధులతో కొత్త పథకాలు, గ్రాంట్లు, శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టకూడదని తెలిపారు. బహిరంగ సభలు, ఊరేగింపులు, లౌడ్స్పీకర్లు వినియోగంపై పోలీస్శాఖ, మున్సిపల్ శాఖ అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో వున్నందున ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## డీఎస్టీ-క్యూరీ-కృత్రిమ మేధస్సు కేంద్రంలో...

## పిఎం ఉషా కార్యక్రమం



తిరుపతి,అక్టోబర్ 14ప్రభాతవార్త: సమాచార విశ్లేషణ, సర్వేలు నిర్ణయాలు తీసుకోవడంలో కృత్రిమ మేధస్సు అనే అంశంపై రెండు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైంది. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ విభాగం డిజిటల్ తరగతి గదిలో జరిగింది. సామాజిక శాస్త్రాల పరిశోధన, సర్వేల విశ్లేషణ, సమాచార ప్రసారం, డిజిటల్ కథన రూపకల్పన, పనితీరు సామర్థం పెంపు దల, బోధన, అభ్యసనం విద్యా సంబంధిత పాఠ్యాంశాల రూపకల్పనలో కృత్రిమ మేధస్సు సాధనాలను సమర్థవంతంగా వినియోగించే నైపుణ్యాలను అధ్యాపకులకు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి విట్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ టి ఎస్. ప్రదీప్ కుమార్, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డీఎస్టీ- క్యూరీ-కృత్రిమ మేధస్సు కేంద్రం సమన్వయకర్త ఆచార్య పి. వెంకటకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.ఉష లు పాల్గొన్నారు.

## పద్మావతిలో నవరాత్రి వేడుకలు



తిరుపతి,అక్టోబర్ 14ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సంగీత,నృత్య లలిత కళల విభాగం తరపున నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. సంగీత నృత్యం నేర్చుకునే వివిధ విభాగాలకు చెందిన విద్యార్థినులు నవదుర్గ అంబా స్తుతిని, ఓంకార రూపిణీ నృత్యాన్ని, గర్బా నృత్యాన్ని ప్రదర్శించారు. చివర అందరూ విద్యార్థి నులతో కలిసి ఉపకులపతి ఆచార్య వి.ఉమ, డీన్ ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి అధ్యాపక బృందం కలిసి దాండియా ఆడారు.

## సంయుక్త పీహెచ్డీ కోసం ఐఐటీ, ఐసర్తో డల్హౌసీ యూనివర్సిటీ ఒప్పందం




శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజక వర్గంలో ఏర్పడిన ప్రతిష్టాత్మక ఐఐటి,ఐసర్లు కెనడాకు చెందిన డల్హౌసి విశ్వవిద్యాలయంతో బుధవారం సంయుక్త పిహెచ్డి కోసం కీలక ఒప్పందం కుదుర్చుకున్నారు. టీమ్ కెనడా ట్రేడ్ మిషన్ ఇన్ ఇండియాలో భాగంగా డల్హౌసీ విశ్వవిద్యాలయం ఐఐటీ, ఐసర్ సంస్థలతో సంయుక్త పీహెచ్డీ కార్యక్రమాల కోసం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో కెనడా అంతర్జాతీయ వాణిజ్య శాఖ మంత్రి మణిందర్ సిద్ధూ, కెనడా కాన్సుల్ జనరల్ జెఫ్ డేవిడ్, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందం మేరకు తిరుపతిలో ఏర్పాటు చేయనున్న డల్హౌసీ ట్రైఇన్స్టిట్యూషనల్ గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాంపస్ చొరవతో సాధ్యమైందని ప్రతినిధులు వివరించారు. కెనడా భారత్ పరిశ్రమ, విద్యాసంస్థల సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు పరిశోధనలను ఆర్థిక, సామాజిక ప్రగతికి ఉపయోగపడేలా మార్చడంలో ఇది కీలక మైలురాయి కానుందని ప్రతినిధులు వివరించారు. పరిశ్రమ భాగ స్వామ్యమే ప్రధాన లక్ష్యంగా ఈ భాగస్వామ్యం ఉత్పత్తి అభివృద్ధి, వాణిజ్యీకరణ, మార్కెట్ యాక్సెస్, పటిష్టమైన సరఫరా గొలుసులు, సాంకేతిక బదిలీ వంటి అంశాలపై సహకార ప్రాజెక్టులను చేపడుతుంది. సంయుక్త పీహెచ్డీ క్లీన్ ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, హెల్త్ టెక్నాలజీస్, బయో మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్, ప్రెసిషన్ అగ్రికల్చర్, డిజిటల్ సిస్టమ్స్, అప్లైడ్ ఏఐ వంటి వ్యూహాత్మక రంగాలపై దృష్టి సారించనుంది. ఈ ఒప్పందంపై డల్హౌసీ యూనివర్సిటీ ఏవీపీ గ్లోబల్ రిలేషన్స్ డా. బాలకృష్ణన్ పృథ్వీరాజ్, ఐసర్ తిరుపతి ఇంటర్నేషనల్ రిలేషన్స్ అసోసియేట్ డీన్ డా. అన్నపూర్ణాదేవి అల్లు, ఐఐటీ తిరుపతి డీన్ అకడమిక్స్ డా. శశిధర్ గుమ్మా సంతకాలు చేశారు.

## కనకదుర్గమ్మకు బంగారు సామగ్రి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కనకాచలంపై వెలసిన కనక దుర్గమ్మ వారికి శ్రీకాళహస్తికి చెందిన భక్తులు రూ.16లక్షల విలువ చేసే బంగారు కానుకలను అందించారు. దుర్గమ్మ కొండపై ప్రతి రోజూ పూజలు అభిషేకాలు,ప్రత్యేకాలంకారాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన లింగారెడ్డి లక్ష్మారెడ్డి కుటుంబసమేతంగా అమ్మవారికి తయారు చేయించిన బంగారు ఉరువులను అందించారు. ఈ విరాళాన్ని ఆలయ చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్,ఇఓ బికె వెంకటేశులుకు అందించారు. ఈ కార్యక్రమాల్లో చిన్న ఆలయాల ఇన్చార్జి లక్ష్మయ్య, ఎఇఓ విద్యాసాగర్రెడ్డి, హేమామాలిని అకౌంటెంట్ యుగంధర్,రవి, ప్రదీప్రెడ్డితో పాటు పౌరోహితులు అర్ధగిరిలు పాల్గొన్నారు. అమ్మవారికి బంగారు అలంకరణ సామగ్రిని అందించిన దాతలను ప్రత్యేకంగా స్వామి అమ్మవార్ల దర్శనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందించారు.

## దేవస్థానం నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తుల కానుకల ద్వారా వచ్చే నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అందుబాటులో ఉన్నా నాలుగో గేటు వద్ద నిబంధనల ప్రకారం శాశ్వత మండపాలు నిర్మించకుండా రూ.77 లక్షలతో తాత్కాలిక రేకుల షెడ్లు వేయడం నిధుల దుర్వినియోగమేనని ఆరోపించారు. పవిత్ర క్షేత్రంలో సినిమా సెట్టింగ్ల తరహాలో షెడ్లు వేయడం సరికాదని, గతంలో దుర్గమ్మ కొండపై టెండర్లు లేకుండా నిర్మించిన షెడ్లు, బుకింగ్ కౌంటర్లు నిరుపయోగంగా మారాయని గుర్తుచేశారు. భక్తుల హుండీ కానుకలతో చేపట్టిన ఈ నిర్మాణాలను భక్తులకు ఉపయోగపడేలా ఉచిత డార్మిటరీలుగా మార్చాలని సూచించారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని ఈవోను కోరారు. కూటమి వచ్చిన తరువాత దుర్గమ్మ కొండపై టెండర్లులేకుండా నామినేషన్పై నిర్మించినరేకుల షెడ్డు, బుకింగ్కౌంటర్లు, ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని శ్రీనివాసులు ధ్వజమెత్తారు. భక్తులు హుండీల్లో భక్తి భావంతో వేసిన సొమ్మును భక్తుల సౌకర్యార్థం ఉపయోగించాలి తప్ప శిధిలం చేయరాదన్నారు. రూ.2కోట్లతో నిర్మించిన షెడ్డులను ఉచిత డార్మెంటరీలుగా మార్చాలని ఆయన సూచించారు. ఇఓ,పాలకమండలి పారదర్శకత, నిబంధతతో పని చేస్తున్నామని చెబుతున్నట్లు భక్తుల సొమ్ములను సద్వినియోగం చేయాలి తప్ప దుర్వినియోగం కాకూడదని డిమాండ్ చేసారు. ఇక్కడ జరుగుతున్న అవకతవకలపై, నిర్మాణాలపై ప్రత్యేక కమిటిని నియమించి విచారణ జరపాలని అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేసారు.

## ఉరుము ఉరిమింది...చినుకు రాలింది

### -తుపాన్ ప్రభావంతో చల్లబడ్డ వాతావరణం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: ఆకాశంలో ఉరుము ఉరిమింది. చినుకు రాలింది. వాతావరణం చల్లబడింది. బుధవారం వేకుమ జాము నుంచి వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తెరపలు తెరపలుగా వర్షం కురిసింది. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం గత కొన్ని నెలలుగా భగ భగ మండుతుంది. గత 50 సంవత్సరాల్లో లేని వాతావరణం చోటు చేసుకుందని వృద్ధులు తల్లడిల్లిపోయారు. సాధారణంగా ఈ ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాలతో అత్యధిక వర్షపాతం నమోదు కావటం ఆనవాయితి. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు సుమారు వెయ్యి మిల్లిమీటర్ల వర్షపాతం నమోదౌతుంది. అయితే ఈ సారి ఎల్నినో ప్రభావం ఈ ప్రాంతాలపై అధికంగా కనబడింది. దాంతో వర్షాలు లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్ పంటలను రైతులు వేయలేదు. బావులు,బోర్లు ఉన్న రైతులు కకూడా సాహసించలేదు. ఉదయం నుంచి వాతావరణం చల్లబడటంతో ప్రజలు హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే వర్షంలోనూ కనకాచలంపై వెలసిన అమ్మవారి ఆలయానికి మహిళా భక్తుల తాకిడి తగ్గలేదు.

## భద్రత కల్పించాలని డీఎస్పీకి కాంగ్రెస్ వినతి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పావనిని కాంగ్రెస్ నేత తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గల బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు అధికంగా ఉన్నాయని, స్వర్ణముఖి కట్ట అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఉందని దామోదరంరెడ్డి డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఎస్పీ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సుధాయాదవ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, ఆంటోనీ, నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు మండలాధ్యక్ష కుర్చీ ఎస్సిలకు

తొట్టంబేడు,అక్టోబర్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం రాజకీయాలకు కీలకం. గతంలో ఈ మండల అధ్యక్షపదవి మహిళా జనరల్కు కేటాయించారు. ఈ సారి ఈ సీటును ఈ సారి దళిత మహిళకు కేటాయించారు. దాంతో ఇక్కడి రాజకీయాలపై ఉత్సాహం తుస్సు మంది. అయితే జడ్పిటిసి మాత్రం జనరల్ చేసారు. కానీ తిరుపతి జిల్లా పరిషత్ ఎస్సి మహిళకు కేటాయించటంతో రాజకీయ నిరాశ చోటు చేసుకుంది అధికారులు ప్రకటించిన వివరాలు మేరకు మండలంలోని తొట్టంబేడు 8 ఎంపీటీసీలలో పొయ్య ఎస్టీ, పురుషులుగా పెదకనలి, తాటిపర్తి ఎస్సీ పురుషులుగా పూడి, బోనుపల్లి ఎస్సీ మహిళలుగా తొట్టంబేడు బీసీ మహిళ, అన్ రిజర్వుడ్ పురుషులు చియ్యవరం, చిటతూరు అన్రిజర్వుడ్ మహిళలుగా తంగేళ్లపాలెం, పెద్దకనపర్తి, కాసరం, ఎంపీపీ పీఠానికి ఎస్సీ జెడ్పీటీసీగా అన్రిజర్వుడ్ పురుషులకు కేటాయించారు. దాంతో రాజకీయ నాయకుల్లో నిరాశ చోటు చేసుకుంది.

## డ్రైనేజీ కాలువ దుస్థితి, పట్టించుకోని అధికారులు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 14 ప్రభాతవార్త: పట్టణంలోని కొత్తపేట గండ్ల వీధిలో డ్రైనేజీ కాలువ మరమ్మతుకు నోచుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినాయకుడి గుడి పక్కన, శ్రీరామ మందిరం ముందు గల డ్రైనేజీ కాలువపై బుధవారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికే దారి కనపడకుండా వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. అదేవిధంగా పైపులైన్ కోసం సిమెంట్ రోడ్డుపై మూడు చోట్ల కాలువలు త్రవ్వి మట్టి పోసి రెండేళ్లుగా అలాగే వదిలేశారని, దీనిపై వార్డు సచివాలయంలో మున్సిపల్ కార్మికులకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన మరమ్మతులు చేపట్టకపోతే వర్షాకాలంలో రాకపోకలకు ఆటంకంతో పాటు ప్రాణాపాయ ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు

## రెండో గేటు వద్ద...కొత్త ఆటో స్టాండ్ వద్దు!



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి దేవస్థానం రెండో గేటు వద్ద కొత్త ఆటో స్టాండ్ ఏర్పాటుతో వివాదాలు సృష్టించవద్దని ఏఐటీయూసీ నాయకులు సూచించారు. రెండో గేటు నుంచి వేడం, రామాపురం, అబ్బాబట్లపల్లి, భతినయ్య కాలనీ తదితర పది గ్రామాలకు గత 30 సంవత్సరాలుగా ఆటోలు నడుపుకుంటూ పలువురు కార్మికులు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. గత రెండు మూడు రోజులుగా కొంతమంది కొత్తగా అక్కడే స్టాండ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడంతో ఇరు వర్గాల మధ్య వివాదాలు తలెత్తే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇప్పటికే జీవనాధారం పొందుతున్న కార్మికులకు ఇబ్బందులు కలిగించకుండా రెండో గేటు కాకుండా అనువైన మరో ప్రాంతంలో స్టాండ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్మికుల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధంగా వ్యవహరించకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రొడ్డ గోపి, రైతు సంఘం నాయకులు రాజయ్య, ఆటో కార్మికులు చిట్టిబాబు, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, పెంచలయ్య, జనకయ్య, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## కుల ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం : సీపీఐ



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వకుండా అధికారులు, కూటమి నేతలు వేధిస్తున్నారని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీ సేవ, స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ వార్డు కేంద్రాల్లో సర్వర్లు పని చేయడం లేదనే నెపంతో కుల ధృవీకరణ పత్రాల జారీలో తీవ్ర ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో తమకు సరైన పోటీ ఉండకూడదనే దురుద్దేశంతోనే కూటమి నేతలు ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, పోటీ చేసే అభ్యర్థులందరికీ ఎలాంటి ఆటంకాలు లేకుండా వెంటనే కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని జనమాల గురవయ్య డిమాండ్ చేశారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 14 ప్రభాతవార్త: ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్టియు అనుబంధ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ జనరల్ బాడీ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని మహేష్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ పాల్గొన్నారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. జాకీర్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలని, పెరుగుతున్న నిత్యావసర, పెట్రోల్, డీజిల్ ధరల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు డివిజన్ నాయకులు కే. సురేష్,వన్ టౌన్ ఎస్ఐ రామకృష్ణ, ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కుడుం.విజయకుమార్ ఐఎఫ్టియు డివిజన్ నాయకులు మూర్తి, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు జహీరా, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రేమ, బాల, మనీ, మదన్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల వేళ శ్రీకాళహస్తి కాంగ్రెస్లో కసరత్తు



శ్రీకాళహస్తి అక్టోబర్ 14 ప్రభాతవార్త: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు రంగం సిద్ధమవుతున్న వేళ శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులతో భేటీలు ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డా. బత్తయ్య నాయుడుతో సమన్వయకర్త తలపామోదరం రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుమారు గంటపాటు జరిగిన ఈ భేటీలో రాబోయే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో బలమైన అభ్యర్థులను ఎంపిక చేయడం, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎంపిక విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు, సామాజిక సమీకరణాలు తదితర అంశాలపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు. తలపా దామోదర్రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వర్గాల కాంగ్రెస్ సీనియర్ నాయకులను వ్యక్తిగతంగా కలిసి వారి సూచనలు, సలహాలు తీసుకుంటానని, అందరి అభిప్రాయాల మేరకు సమన్వయంతో ముందుకు వెళ్తామని తెలిపినట్లు సమాచారం. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి విషయంలో తుది నిర్ణయం అధిష్టానం తీసుకుంటుందని, ప్రస్తుతం అందరి అభిప్రాయాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాత వార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన కార్యక్ర మాలకు పట్టణ అధ్యక్షుడు జి.విజ యకుమార్ నాయుడు అధ్యక్షత వహించారు. ఇక మున్సిపల్ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా క్లస్టర్ ఇన్చార్జిలు వెంటనే పరిశీలించి అధికారులతో చర్చించాలని ఎంఎల్ఏ సూచించినట్లు విజయ కుమార్ నాయుడు తెలిపారు. త్వరలో జరగబోవు మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ విజయం సాధించుటకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జ్ పేట బాలాజీ, తెలుగుదేశం టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాసురం రమేష్, స్టేట్ కార్యదర్శి మాసరపు సుబ్బయ్య, శ్రీకాళహస్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బాలు ఢిల్లీ బాబు, బూత్ ఇంచార్జ్ నెమలూరు బుజ్జి (సుబ్రహ్మణ్యం )షాకిర్ అలీ,షఫీ,వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు సముచిత స్థానం



తిరుపతి,అక్టోబర్ 14ప్రభాతవార్త: టిడిపిలో అన్ని వర్గాలకు సముచిత స్థానం ఉంటుందని తిరుపతి ఇన్ఛార్జి జెబి శ్రీనివాస్ తెలిపారు. తిమ్మినాయుడుపాళెంకు చెందిన దినేష్, నాని రాయల్, అనిల్ రెడ్డి, అశోక్ సహా 100 మంది యువతతో కలిసి తెలుగుదేశం పార్టీ లోకి చేరారు. ఇన్చార్జి జెబి శ్రీనివాస్, శాప్ చైర్మన్ రవి నాయుడు, తాతయ్యగుంట ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్చార్జ్ పులిగోరు మురళీకృష్ణ రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.